# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :66 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 09-05-2025 | పేజీలు:4 వెల: 2.00


## దేశవ్యాప్తంగా ఆపరేషన్ అభ్యాస్..!

న్యూఢిల్లీ,భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఒకవేళ వైమానిక దాడులు, భారీగా అగ్ని ప్రమాదాలు జరిగితే పౌరులు తమ ప్రాణాలను ఎలా కాపాడుకోవాలి అన్న అంశంపై అవగాహన కల్పించేందుకు బుధవారం తెలంగాణ సహా పలు రాష్ట్రాలు 'ఆపరేషన్ అభ్యాస్' పేరిట మాక్ డ్రిల్‌లు నిర్వహించాయి. ఆపరేషన్ సిందూర్ పేరిట భారత త్రివిధ దళాలు పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర స్థావరాలపై దాడులు జరిపిన కొన్ని గంటలకే మాక్ డ్రిల్స్ ప్రారంభమయ్యాయి. దేశ రాజధాని ఢిల్లీ సహా పలు ప్రధాన నగరాలు, కీలక ప్రాంతాల్లో ఈ డ్రిల్స్ జరిగాయి.ఢిల్లీలో 55 ప్రాంతాల్లో ఈ డ్రిల్స్ నిర్వహించారు. నగరమంతటా పోలీసు వాహనాలు, అగ్నిమాపక శకటాలను మోహరించారు. డ్రిల్ ప్రారంభం కాగానే సైరన్లు మోగాయి, వెంటనే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. గాయపడిన వారిని స్ట్రెచర్ల మీద దవాఖానలకు తరలించారు. ఇక పలు బహుళ అంతస్తుల భవనాల్లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు అగ్నిమాపక దళాలు క్రేన్లను ఉపయోగించాయి.ఘటనా స్థలాలకు డాక్టర్లు, అంబులెన్స్‌లు పరుగులు తీశాయి.

## ఆపరేషన్ సిందూర్‌తో నేలమట్టమైన ఉగ్రస్థావరాలు..



జమ్ము కశ్మీర్: జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై దాడికి పాల్పడి 26 మంది అమాయకుల ప్రాణాలు తీసిన ఉగ్రవాదులపై భారత్ ప్రతీకారం తీర్చుకున్నది. ఆ ఉగ్రమూకలను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌పై మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో ప్రతిదాడికి దిగి పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)తోపాటు పాకిస్థాన్‌లోని మూడు ప్రధాన ఉగ్రవాద సంస్థలు జైషే మహ్మద్, లష్కరే తాయిబా, హిజ్బుల్ ముజాహిదీన్‌లకు చెందిన 9 ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. వాటిలోని అనేక మంది ముష్కరులను తుదముట్టించింది. వీటికి సంబంధించిన ఉపగ్రహ చిత్రాలు తాజాగా బయటికొచ్చాయి.భారత్ దాడుల్లో బహవల్‌పూర్‌లోని జైషే మహ్మద్ ప్రధాన కార్యాలయం మురీద్కేలోని లష్కరే తయ్యిబా ఉగ్ర క్యాంప్‌లు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. జైషే చీఫ్ మసూద్ అజార్ కుటుంబంలోని 10 మంది ప్రాణాలు కోల్పోయారు. అంతేకాదు నలుగురు సహాయకులు, సన్నిహితులు కూడా మరణించినట్లు తెలిసింది. మొత్తంగా భారత్ జరిపిన ఈ దాడిలో 80 మంది వరకూ ఉగ్రవాదులు ప్రాణాలు కోల్పోయినట్లు వార్తలు వచ్చాయి. మరోవైపు 'ఆపరేషన్ సిందూర్'కు ప్రతిచర్యగా పాకిస్థాన్ దాడులు చేసే అవకాశం ఉండటంతో భారత్ అప్రమత్తమైంది. సరిహద్దు రాష్ట్రాల్లో భద్రతను కట్టుదిట్టం చేసింది. ముఖ్యంగా పంజాబ్‌లో హై అలర్ట్ ప్రకటించింది. అన్ని ప్రజా కార్యక్రమాలను రద్దు చేశారు. విమానాశ్రయాలను మూసివేసింది.

### పాక్ రేంజర్ల కాల్పులలో అమరుడైన భారత జవాన్

న్యూఢిల్లీ:పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిగా పాక్ భూభాగంలో భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' తో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. మరోవైపు సరిహద్దులో పాక్ రేంజర్లు విచక్షణారహితంగా కాల్పులు జరుపుతున్న విషయం తెలిసిందే. కుప్వారా, బారాముల్లా, ఉరి, అఖ్నూర్ సెక్టార్లలోని సరిహద్దు గ్రామాలపై పాక్ బలగాలు మోర్టార్ షెల్లింగ్,ఫైరింగ్‌కు పాల్పడుతున్నాయి. ఈ కాల్పులను భారత సైన్యం తిప్పికొడుతోంది.నివాస ప్రాంతాలే లక్ష్యంగా పాక్ కాల్పులు జరుపుతుండటంతో సరిహద్దు ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## సరిహద్దుల్లో పాక్ సైన్యం దుశ్చర్య.. కాల్పులను తిప్పికొట్టిన భారత సైన్యం..



జమ్ము కశ్మీర్: నియంత్రణ రేఖ వెంట సరిహద్దులు దాటి పాకిస్తాన్ కాల్పుల ఉల్లంఘనకు పాల్పడుతున్నది. కుప్వారా, బారాముల్లా, ఉరి, అఖ్నూర్ సరిహద్దు పోస్టుల వద్ద పాక్ సైన్యం కాల్పులకు తెగబడుతున్నది. సరిహద్దుల్లో కాల్పుల తీవ్రతను పాక్ సైన్యం పెంచుతున్నది. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ రేంజర్లు తీవ్రతను మరింత పెంచారు. అదే సమయంలో నిన్నటి నుంచి ఆయుధాలను సైతం సైన్యం మార్చింది. చిన్న ఆయుధాల నుంచి మోర్టార్ గన్స్, శతఘ్నులతో దాడులకు దిగుతున్నారు. పాక్ రేంజర్ల కాల్పులను భారత సైన్యం ధీటుగా ఎదుర్కొంటూ బదులిస్తున్నది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ ఊహించని విధంగా షాక్ ఇవ్వడంతో పాకిస్తాన్ సైన్యం మరింత రెచ్చిపోతున్నది.పూంచ్, బారాముల్లా, రాజౌరి జిల్లాల్లో నియంత్రణ రేఖ సమీపంలోని గ్రామాలపై మంగళవారం రాత్రంతా దాడులకు తెగబడింది. పాకిస్తాన్ జరిపిన కాల్పుల్లో నలుగురు పిల్లలు సహా 15 మంది మరణించిన విషయం తెలిసిందే. జమ్మూ, శ్రీనగర్‌లోని అనేక ప్రాంతాల్లో బుధవారం మధ్యాహ్నం 2 గంటల వరకు షెల్లింగ్ కొనసాగిందని ఆర్మీ వర్గాలు తెలిపారు. భారత్ జరిపిన ప్రతి దాడుల్లో పాక్ సైనికులు సైతం ప్రాణాలు కోల్పోయారు. డజన్ల కొద్దీ పాక్ పోస్టులు ధ్వంసమయ్యాయి. ఉద్రిక్తత నేపథ్యంలో జమ్మూ, శ్రీనగర్ డివిజన్‌లోని పలు పాఠశాలలను మూసివేశారు. ముందు జాగ్రత్త చర్యగా జమ్మూ, శ్రీనగర్, లేహ్ నుంచి విమాన సేవలు, కథువాకు హెలికాప్టర్ సేవ నిలిపివేశారు. అన్ని ప్రభుత్వ విభాగాలలోని అధికారులు, ఉద్యోగుల సెలవులు రద్దు చేశారు. భారత సైనికులు ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు పాక్, పీవోకేలోని ఉగ్రస్థావరాలపై దాడి చేసింది.ఇన్నాళ్లు వితండవాదం చేస్తూ ఉగ్రవాదులను పెంచి పోషించిన పాకిస్తాన్ సైన్యం ప్రస్తుతం సరిహద్దుల్లో బుసలు కొడుతున్నది. ఎల్‌వోసీని ఆనుకొని ఉన్న బాలకోట్, మెంధార్, మాన్కోట్, కృష్ణ ఘాటి, గుల్పూర్, కెర్నీ, పూంచ్ కాల్పులు జరుపుతూ వచ్చింది. పాక్ దాడిలో పెద్ద సంఖ్యలో ఇండ్లు దెబ్బతిన్నాయి. బారాముల్లా జిల్లాలోని ఉరి సెక్టార్‌లో సరిహద్దు దాటి జరిపిన కాల్పుల్లో ఐదుగురు పిల్లలు సహా పది మంది గాయపడ్డారు. రాజౌరి జిల్లాలోని థండికాస్సి, ఇరాద ఖేత్రా, గంభీర్ బ్రాహ్మణ్ గ్రామాలపై పాకిస్తాన్ కాల్పులు జరిపింది. పూంచ్ జిల్లాలోని నియంత్రణ రేఖకు సమీపంలో ఉన్న గురుద్వారా సాహిబ్‌ను పాకిస్తాన్ లక్ష్యంగా చేసుకుంది. పూంచ్ కాల్పులు కొనసాగాయి. దాంతో భారీగా వాహనాలు దెబ్బతిన్నాయి. కుప్వారా జిల్లాలోని కర్నా సెక్టార్‌లో కాల్పుల కారణంగా అనేక ఇళ్లు మంటల్లో చిక్కుకున్నాయి. భారీ కాల్పుల కారణంగా బాధితులను ఆసుపత్రికి తరలించేందుకు ఇబ్బందులు ఎదురయ్యాడు. ఉద్రిక్తత మధ్య అఖ్నూర్ ప్రాంత సరిహద్దు ప్రాంతాల నుంచి చాలా మంది తమ ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు వెళ్లారు.ఫిబ్రవరి 25, 2021న భారతదేశం-పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. అయినా తరుచూ పాకిస్తాన్ కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూ వస్తున్నది. కాల్పుల విరమణకు ముందు 2018 సంవత్సరంలో భారీ నష్టం జరిగింది. సరిహద్దు ప్రాంతాల్లో పాకిస్తాన్ జరిపిన షెల్లింగ్‌లో 30 మంది పౌరులు మరణించారు. 2019లో 18 మంది పౌరులు, 2020లో 15 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. పాకిస్తాన్ కాల్పుల నేపథ్యంలో స్థానిక ప్రభుత్వం పరిస్థితిని ఎదుర్కోవడానికి పూర్తిగా సిద్ధంగా ఉంది. సున్నితమైన ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షితమైన ప్రదేశాలకు తరలించి, బోర్డింగ్, వసతి, ఆహారం, వైద్యం, రవాణాను నిర్ధారించాలని జిల్లా డిప్యూటీ కమిషనర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి.

## పాక్ కాల్పులను నిశితంగా గమనిస్తున్న భారత్..

న్యూఢిల్లీ, పాకిస్తాన్ కాల్పుల విరమణ ఒప్పందానికి విరుద్ధంగా సరిహద్దుల్లో పెద్ద ఎత్తున దాడులు చేస్తుండగా.. భారత సైన్యం నిశితంగా గమనిస్తోంది. ఆర్మీ చీఫ్ స్థానిక ఆర్మీ యూనిట్లతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పాకిస్తాన్ సైన్యం కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నారు. నియంత్రణ రేఖ వద్ద భారత పౌరులను లక్ష్యంగా చేసుకుని పాకిస్తాన్ సైన్యం జరుపుతున్న కాల్పులకు తిరిగి సమాధానం ఇచ్చేందుకు భారత సైన్యానికి స్వేచ్ఛ ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.పాకిస్తాన్, పీవోకేలోన ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యం క్షిపణి దాడులు చేసినప్పటి నుంచే పాకిస్తాన్ సరిహద్దుల వెంట ఈ దుశ్చర్యకు పాల్పడుతున్నది. త్రివిధ దళాల సంయుక్త ఆపరేషన్‌లో మొత్తం తొమ్మిది ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా దాడికి పాల్పడ్డాయి. పహల్గాం ఉగ్రవాద దాడికి భారత దళాల నుంచి ఊహించని విధంగా బదులివ్వడంతో.. పాకిస్తాన్ సైన్యం, మంగళవారం రాత్రి అంతా పూంచ్, బారాముల్లా, రాజోరి జిల్లాల్లోని నియంత్రణ రేఖ సమీపంలోని గ్రామాలపై పెద్ద ఎత్తున కాల్పులు జరిపింది. పాక్ కాల్పుల్లో నలుగురు పిల్లలు సహా 15 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మరో 57 మంది గాయపడ్డారు.ఇందులో 12 మంది మృతులను గుర్తించారు. పాక్ రేంజర్లు దుశ్చర్యకు భారత ఆర్మీ సైతం గట్టి సమాధానం ఇచ్చింది. భారత జరిపిన కాల్పుల్లో పాకిస్తాన్ సైనికులు పెద్ద ఎత్తున చనిపోయారని సమాచారం.



డజన్ల కొద్దీ పోస్టులు ధ్వంసమయ్యాయి. ఈ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో జమ్మూ డివిజన్‌లోని ఐదు జిల్లాలు, కశ్మీర్ డివిజన్‌లోని మూడు జిల్లాల్లో పాఠశాలలను మూసివేశారు. ముందు జాగ్రత్త చర్యగా జమ్మూ, శ్రీనగర్, లేహ్ నుంచి విమాన సర్వీసులను నిలిపివేశారు. కథువాలో హెలికాప్టర్ సేవలను సైతం నిలిపివేశారు. అన్ని ప్రభుత్వ విభాగాల్లో అధికారులు, సిబ్బంది ఉద్యోగుల సెలవులు రద్దు చేశారు.

## పాకిస్తాన్‌లోని లాహోర్ సిటీలో వరుస పేలుళ్లు...



లాహోర్:పాకిస్తాన్‌కు అసలు టెన్షన్ మొదలైంది.ఆపరేషన్ సిందూర్‌తో ఉక్కిరిబిక్కిరి అవుతోంది దాయాది దేశం పాకిస్తాన్. ఈ క్రమంలో గురువారం ఉదయం లాహోర్ సిటలో పేలుళ్లు సంభవించాయి. దీన్ని అధికారులు ధృవీకరించారు. ఈ నేపథ్యంలో లాహోర్ ఎయిర్ పోర్టును మూసివేశారు అధికారులు.

### లాహోర్ సిటీలో వరుస పేలుళ్లు

గురువారం ఉదయం దాదాపు ఎనిమిది గంటల సమయంలో లాహోర్ సిటీలోని వాల్టన్ రోడ్డులో భారీ పేలుళ్లు సంభవించాయి. వాల్టన్ విమానాశ్రయానికి సమీపంలోని గోపాల్ నగర్, నసీరాబాద్ ప్రాంతాలలో వరుస పేలుళ్లు చోటు చేసుకున్నాయి. భారీ శబ్దంతో పేలుళ్లు సంభవించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.భయంతో తమ ఇళ్ల నుండి ప్రజలు బయటకు పరుగులు తీశారు. గాలిలోదట్టమైన పొగ మేఘాలు కమ్ముకున్నాయి. ఈ విషయాన్ని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. పేలుడు జరిగిన కొద్దిసేపటికే ఆ ప్రాంతంలో సైరన్లు వినిపించాయి. చాన్నాళ్లు సైరన్ మోగడంతో లాహోర్ సిటీ వాసులు అలర్ట్ అయ్యారు. దీంతో ఆ సిటీలో అత్యవసర పరిస్థితిని మరింత పెంచింది.పేలుళ్ల గురించి సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు అలర్ట్ అయ్యారు. పేలుడు జరిగిన ప్రాంతానికి చేరుకున్నారు. ఘటన గురించి వివరాలు సేకరించే పనిలో పడ్డారు. ఈ ప్రాంతానికి బాంబులు పేలడానికి గల కారణలేం టి? ఎవరైనా వాటిని తీసుకొచ్చారా? ఎవరైనా కావాలనే చేస్తున్నారా? ప్రజల్లో మరింత భయాందోళనలు రేకెత్తించడానికి ఈ తరహా ప్లాన్ చేస్తున్నారా? ఇలా అనేక అనుమానాలు మొదలయ్యాయి.ఆపరేషన్ సిందూర్ తర్వాత ఆదేశ ప్రజల్లో కొంత భయం నెలకొంది. కేవలం ఉగ్రవాదుల స్థావరాలపై భారత్ దాడులు చేసినా, తమ దేశంపై దాడి చేసినట్టుగా క్రియేట్ చేసే పనిలో పడింది దాయాది దేశం. దీనికితోడు ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్తాన్ కొన్ని సిటీ ల్లో రెడ్ అలర్ట్ ప్రకటించింది.అధికారుల సెలవులను సైతం రద్దు చేసింది. దీ ంతో అక్కడి ప్రజల్లో భయం నెలకొంది.ఇదంతా ఒక వైపు వెర్షన్ మాత్రమే. రె ండో వైపు వద్దాం. ఉగ్రవాదుల స్థావరాలపై భారత్ దాడి చేసి 24 గంటలు గ డుస్తో ంది. అయినా ప్రభుత్వంలో ఎలాంటి కదలిక లేదన్నది అతివాదుల మాట. ఈ క్రమంలో వరుస పేలుళ్లు చోటు చేసుకున్నాయని అంటున్నారు. మరోవైపు ఉగ్రవాదుల కీలక నేతల నుంచి పాక్ ప్రభుత్వంపై ఒత్తిడి తీవ్రమవుతు న్నట్లు ఆ దేశ మీడియాలో వార్తలు హంగామా చేస్తున్నాయి.ప్రస్తుత పరిస్థితుల్లో ఏం జ రుగుతుందో తెలియన పాకిస్థాన్‌లోని ప్రజలు బిక్కుబిక్కు మంటూ కాలం వెళ్ల దీస్తున్నారు. ఈ టెన్షన్ ఎన్నాళ్లు అంటూ పలువురు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో పాక్ ప్రభుత్వానికి ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అన్నచందంగా మారింది.ఈ పరిస్థితి ఆదేశం ఎప్పుడు బయటపడుతుందో చూడాలి.

## ఆత్మరక్షణ కోసం పోరాడే హక్కు భారత్‌కు ఉంది...



బ్రిటన్ : పహల్గాం ఉగ్రదాడిలో అమాయకుల ప్రాణాలు తీసిన ఉగ్రవాద సంస్థలపై దాడి చేసే హక్కు భారత్‌కు పూర్తిగా ఉందని బ్రిటన్ ఎంపీ ప్రీతి పటేల్ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్ ఉగ్రస్థావరాలపై భారత్ మెరుపు దాడులు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై ఆమె అక్కడి హౌస్ ఆఫ్ కామన్స్‌లో మాట్లాడారు. ఈసందర్భంగా పహల్గాం బాధిత కుటుంబాలకు సంతాపం తెలిపారు 'పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులను అన్యాయంగా, క్రూరంగా చంపేశారు. ఈ దాడిలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. ఇది ఉగ్రవాద చర్య. భారత్‌లో ఉగ్రవాద చర్యల కారణంగా దెబ్బతిన్న ముంబయి, న్యూఢిల్లీల జాబితాలో ఇప్పుడు పహల్గాం కూడా చేరింది. ఆత్మరక్షణ కోసం పోరాడే హక్కు భారత్‌కు ఉంది. అమాయకుల ప్రాణాలు పోవడానికి కారణమైన పాకిస్థాన్ లోని ఉగ్రవాదుల స్థావరాలనే భారత్ లక్ష్యంగా చేసుకుంది. యూకే, భారత్ ల మధ్య దీర్ఘకాలిక భద్రతా సహకార ఒప్పందాలు ఉన్నాయి. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న భారత్‌కు బ్రిటన్ ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలి' అని ఆమె పిలుపునిచ్చారు. పాక్ ఉగ్రవాద సంస్థ అయిన లష్కరే తయ్యిబా భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాద చర్యలకు పాల్పడినట్లు చరిత్ర స్పష్టం చేస్తోందని పటేల్ అన్నారు. ఈ ఉగ్రవాద సంస్థకు హమాస్‌తో సంబంధాలు ఉన్నాయని ఇటీవల నివేదికలు వెలువడినట్లు వెల్లడించారు. యూకే దాని మిత్రదేశాల ప్రయోజనాలకు ముప్పు కలిగించేలా ఏ ఉగ్రవాద సంస్థలు ప్రస్తుతం పాక్‌లో చురుకుగా ఉన్నాయో ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరారు.

### పాక్ ప్రతీకారానికి ప్రయత్నించొద్దు

భారత్ చేసిన ఆపరేషన్ సిందూర్‌పై అమెరికా చట్టసభ సభ్యుడు రో ఖన్నా స్పందించారు. ఈసందర్భంగా పాకిస్థాన్ ప్రతీకారానికి ప్రయత్నించొద్దని పిలుపునిచ్చారు. భారత్- పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు తగ్గి శాంతి నెలకొనాలని కోరారు. ఇరుదేశాల మధ్య శాంతి నెలకొల్పేందుకు అమెరికా సిద్ధంగా ఉందన్నారు. పాక్‌లో ప్రస్తుతం నిజాయతీ కలిగిన స్వరం లేదని విమర్శించిన ఆయన ఆ దేశ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్‌ను నియంతగా అభివర్ణించారు.

## అమృత్‌సర్ ఎయిర్‌పోర్ట్ మూసివేత.. స్కూల్స్ బంద్

పంజాబ్:భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఆపరేషన్ సిందూర్ తర్వాత అంతర్జాతీయ సరిహద్దులో పరిస్థితులు మరింత దిగజారాయి. పంజాబ్ సరిహద్దు ప్రాంతాల్లోని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. బుధవారం రాత్రి 1:45 గంటల ప్రాంతంలో అమృత్‌సర్‌లోని మూడు చోట్ల పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. దాంతో ఒక్కసారిగా కలకలం రేగింది. జిల్లా యంత్రాంగం, పోలీసు యంత్రాంగం వెంటనే చర్యలు తీసుకుని మొత్తం జిల్లాలో బ్లాక్‌అవుట్ విధించాయి. ప్రజలు అస్సలు భయపడవద్దని అధికారులు విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు. శ్రీగురు రామ్‌దాస్ అంతర్జాతీయ విమానాశ్రయ టెర్మినల్‌ను పూర్తిగా ఖాళీ చేయించారు. అక్కడ కూడా బ్లాక్‌అవుట్ విధించారు.అయితే, ఏవో పేలుడు శబ్దాలు వినిపించాయని.. కానీ ఇప్పటివరకు ఎలాంటి సంఘటన జరిగిందని సమాచారం అందలేదని పోలీస్ కమిషనర్ గురుప్రీత్ సింగ్ తెలిపారు. వైమానిక దళ విమానాలు తమ కార్యకలాపాల్లో నిమగ్నమయ్యాయి. విమానం టేకాఫ్ అయ్యే శబ్దం చాలా బిగ్గరగా వస్తున్నది. అది చాలా శబ్దాన్ని ఉత్పత్తి చేస్తుంది. కాబట్టి ప్రస్తుతానికి భయపడాల్సిన అవసరం లేదని అధికార వర్గాలు తెలిపాయి. సరిహద్దులో పెరుగుతున్న సైనిక కార్యకలాపాలతో ముందు జాగ్రత్తగా ప్రజలు తమ ఇండ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. ఫజిల్కా సరిహద్దు గ్రామాలైన ముహర్ జంషేర్, మాన్సా నివాసితులు తమ పశువులు, నిత్యావసర వస్తువులు, ఇతర సామగ్రితో వెళ్లిపోతున్నారు.జిల్లా యంత్రాంగం గ్రామాన్ని ఖాళీ చేయమని అధికారిక ఉత్తర్వులు జారీ చేయనప్పటికీ, ప్రజలు స్వయంగా ముందుజాగ్రత్తగా గ్రామాలను ఖాళీ చేస్తున్నారు. పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ వస్తున్నది. భారత సైన్యం ధీటుగా బదులిస్తున్నారు. దాంతో భయానక వాతావరణం ఏర్పడిందని స్థానికులు పేర్కొంటున్నారు. రాత్రిపూట సరిహద్దులో అనుమానాస్పద కదలికలు కనిపిస్తున్నాయని కొందరు




గ్రామస్తులు తెలిపారు. మరోవైపు, ఫజిల్కా జిల్లా యంత్రాంగం పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది. ప్రజలు ఊహాగానాలను పట్టించుకోవద్దని అధికారులు సూచిస్తున్నారు.

### హెలికాప్టర్ కూలి ఐదుగురు మృతి

ఉత్తరాఖండ్ (ఉత్తరాఖండ్)లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. హెలికాప్టర్ కూలి (ఛాపర్ క్రాష్) ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఉత్తర కాశీ జిల్లాలో గురువారం ఉదయం 9 గంటల సమయంలో చోటు చేసుకుంది.కొంతమంది పర్యాటకులతో గంగోత్రికి వెళున్న హెలికాప్టర్ భగీరథి నది (భాగీరథి నది) సమీపంలో కుప్పకూలిపోయింది. ప్రమాద సమయంలో ఏడుగురు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఐదుగురు ప్రాణాలు కోల్పోగా.. మరో ఇద్దరు గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు, రెస్క్యూ బృందాలు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

## ఆపరేషన్ సిందూర్ తర్వాత.. ప్రధాని మోదీతో అజిత్ ధోవల్ భేటీ

న్యూఢిల్లీ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ సమావేశమయ్యారు. గురువారం ఉదయం మోదీ నివాసానికి వెళ్లిన ధోవల్ ప్రధానితో కాసేపు భేటీ అయ్యారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్‌పై దాడుల తర్వాత మోదీతో ధోవల్ భేటీ కావడం ఇదే తొలిసారి. అంతేకాదు మరికాసేపట్లో అఖిలపక్ష సమావేశం జరుగుతున్న నేపథ్యంలో వీరి భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత పరిస్థితులు, సరిహద్దుల్లో ఉద్రిక్తతల గురించి మోదీకి ఆయన వివరించినట్లు తెలుస్తోంది.జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై దాడికి పాల్పడి 26 మంది అమాయకుల ప్రాణాలు తీసిన ఉగ్రవాదులపై భారత్ ప్రతీకారం తీర్చుకున్నది. ఆ ఉగ్రమూకలను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌పై మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో ప్రతిదాడికి దిగి పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)తోపాటు పాకిస్థాన్‌లోని మూడు ప్రధాన ఉగ్రవాద సంస్థలు జైషే మహ్మద్, లష్కరే తాయిబా, హిజ్బుల్ ముజాహిదీన్‌లకు చెందిన 9 ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. భారత్ జరిపిన ఈ దాడిలో 80



మంది వరకూ ఉగ్రవాదులు ప్రాణాలు కోల్పోయినట్లు వార్తలు వచ్చాయి.ఆపరేషన్ సిందూర్ చేపట్టి భారత సైన్యం కేవలం 25 నిమిషాల్లోనే తొమ్మిది ఉగ్రస్థావరాలపై మిస్సైల్స్‌తో కురిపించింది. లష్కరే తోయిబా, జైషే మహ్మద్ ప్రధాన కార్యాలయాలు సహా తొమ్మిది ఉగ్రవాద శిక్షణా కేంద్రాలను నేలమట్టం చేసింది.

## సంపాదకీయం

శుక్రవారం 09-05-2025

# ఏదైనా రాజ్యాంగం పరిధిలోనే!

తమిళనాడులో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికీ, గవర్నర్‌కూ మధ్య ఏర్పడిన వివాదంలో సుప్రీంకోర్టు తీర్పు అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. గవర్నర్లకు స్వతంత్ర అధికారాలేమీ లేవనీ, రాజ్యాంగం ప్రకారం మంత్రిమండలి సలహాలకు అనుగుణంగా బిల్లులను గవర్నర్ నిర్ణీత కాలవ్యవధిలో ఆమోదించాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. తమిళనాడులో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికీ, గవర్నర్‌కూ మధ్య ఏర్పడిన వివాదంలో సుప్రీంకోర్టు తీర్పు అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. గవర్నర్లకు స్వతంత్ర అధికారాలేమీ లేవనీ, రాజ్యాంగం ప్రకారం మంత్రిమండలి సలహాలకు అనుగుణంగా బిల్లులను గవర్నర్ నిర్ణీత కాలవ్యవధిలో ఆమోదించాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. దాంతో దేశంలో గవర్నర్ల పాత్ర మరోమారు చర్చనీయాంశమైంది. తమిళనాడు శాసనసభ 2020–23 మధ్య కాలంలో మొత్తం 12 బిల్లులను గవర్నర్ ఆమోదానికి పంపగా, ఆయన వాటిని తొక్కిపట్టి ఉంచారు. దీన్ని సవాలు చేస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం 32వ రాజ్యాంగ అధికరణ కింద సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ వేసింది. దాంతో గవర్నర్ రెండు బిల్లులను రాష్ట్రపతి ఆమోదం కోసం పంపి, మిగిలిన వాటిని ఎలాంటి వ్యాఖ్యా చేయకుండానే తిప్పిపంపారు. ఆ తరవాత వాటిలో మార్పుచేర్పులేమీ చేయకుండా శాసనసభ యథాతథంగా ఆమోదించి మళ్లీ గవర్నర్‌కు పంపింది. కానీ, ఆయన వాటిని రాష్ట్రపతి ఆమోదం కోసం పంపుతానని పెండింగులో పెట్టారు. తన చర్యకు కారణాలను మాత్రం వెల్లడించలేదు. చట్టాలు, శాసనబద్ధమైన ఏ నిర్ణయానికైనా కారణాలే ప్రధానం. తమిళనాడు మాదిరిగా కేరళలోనూ గవర్నర్‌కూ శాసనసభకూ మధ్య వివాదం నడుస్తోంది. గవర్నర్లు రాజ్యాంగవిరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని ఫిర్యాదు రావడం ఇదే మొదటిసారి కాదు. రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలన విధింపునకు గవర్నర్లు పలుమార్లు 356వ రాజ్యాంగ అధికరణను దుర్వినియోగం చేశారు. ఆ తీరును వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టు వరస తీర్పులు వెలువరించింది.

మొదటి నుంచీ ఇదే తీరు

గవర్నర్ చర్యను న్యాయస్థానాలు తప్పు పట్టిన సందర్భాలు గతంలోనూ అనేకం ఉన్నాయి. ప్రస్తుతం పాలక ఎన్డీయే భాగస్వాములుగా ఉన్న రాజకీయ పార్టీలు సైతం తమపై గవర్నర్లు వివక్షతో అన్యాయంగా వ్యవహరించారని గతంలో గళమెత్తాయి. కోర్టు గుమ్మం తొక్కాయి. అసలు దేశానికి స్వాతంత్ర్యం రాకముందు నుంచే గవర్నర్లు వివాదాస్పద పాత్ర పోషిస్తూ వచ్చారు. 1937లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పడినప్పుడు గవర్నర్లు ఎక్కడికక్కడ చిక్కులు సృష్టిస్తూ వచ్చారు. అందుకే గవర్నర్ పదవులను రద్దు చేయాలని రాజ్యాంగ నిర్మాణ సభ చర్చల్లో హెచ్.వి.కామత్ వంటి నాయకులు డిమాండ్ చేశారు. చివరికి రాష్ట్ర ప్రభుత్వానికి మార్గదర్శకత్వం, సలహాలూ సూచనలు ఇచ్చే పెద్దమనిషి పాత్రను గవర్నర్ పోషించాలనే అభిప్రాయం నెగ్గింది. రాష్ట్రాల్లో విచ్ఛిన్నకర ధోరణులు వ్యక్తమైనప్పుడు, వాటికి అడ్డుకట్ట వేయడానికి కేంద్ర ప్రతినిధిగా గవర్నర్ అవసరమని మరికొందరు అభిప్రాయపడ్డారు. ప్రజాభీష్టానికి ప్రతిరూపమైన పార్లమెంటు, శాసనసభలను కాదనే అధికారం రాష్ట్రపతి, గవర్నర్లకు లేదని రాజ్యాంగం స్పష్టం చేసింది. అసలు వారికి సొంత విచక్షణాధికారం ఉండదని తేల్చింది. అయినాసరే, గవర్నర్లు తమ పరిధి దాటి వ్యవహరించిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

శాసించే అధికారం ఉందా?

రాజ్యాంగ కోర్టుల న్యాయమూర్తులు చట్టసభలు చేసిన చట్టాలను సమీక్షిస్తారు. వాటికి భాష్యాలు చెబుతారు. 200, 201వ రాజ్యాంగ అధికరణలకు చెప్పాల్సిన భాష్యం ఏంటనే దానిమీదే తమిళనాడులో ప్రస్తుత వివాదం ఏర్పడింది. ఈ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడానికి 1952 నుంచి 18 రాజ్యాంగ ధర్మాసనాలు ఇచ్చిన తీర్పులను ప్రస్తావించింది. ప్రప్రథమ పాలనా సంస్కరణల కమిషన్, రాజమన్నార్ కమిటీ, సర్కారియా, పూంఛీ కమిషన్ల నివేదికలనూ పరిగణనలోకి తీసుకుని అత్యంత సమగ్రమైన తీర్పును వెలువరించింది. 200, 201 అధికరణల ప్రకారం శాసనసభ ఆమోదించిన బిల్లులపై గవర్నర్ తన సూచనలను తెలుపుతూ వాటిని పునఃపరిశీలించాలని అసెంబ్లీకి తిప్పిపంపవచ్చు. లేదా రాష్ట్రపతి పరిశీలనకు నివేదించాలి. 163వ అధికరణ ప్రకారం రాష్ట్రపతి, గవర్నర్ పదవులు అలంకారప్రాయమైనవి మాత్రమే. తమ నిర్ణయాలను చట్టసభలు అమలుచేసి తీరాలని శాసించే అధికారం వారికి లేదు. రాష్ట్రపతి, గవర్నర్లు తమ దగ్గరికి వచ్చిన బిల్లులను మూడు నెలల్లో ఆమోదించాలి లేదా తిప్పిపంపాలని చెప్పే అధికారం సుప్రీంకోర్టుకు లేదని కొందరు వాదిస్తున్నారు. కానీ, రాజ్యాంగ నిర్మాణ సభలో ఈ గడువును ఆరు వారాలకు పరిమితం చేయాలనే ప్రతిపాదన వచ్చింది. అయితే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఇది మరీ తక్కువ గడువని పేర్కొన్నారు. దాంతో ద్రవ్య బిల్లులను 'సాధ్యమైనంత త్వరగా' ఆమోదించాలని 111, 200వ అధికరణల్లో నిర్దేశించారు. 'సాధ్యమైనంత త్వరగా' అంటే మూడు నెలలని సుప్రీం భాష్యం చెప్పింది. ఏదిఏమైనా పార్లమెంటు చేసిన బిల్లులపై రాష్ట్రపతి 'సాధ్యమైనంత త్వరగా' తన నిర్ణయాన్ని తెలపాల్సి ఉండగా, గవర్నర్లు నెలల తరబడి శాసనసభ బిల్లులను ఎలా తొక్కిపట్టగలరనేది కీలక ప్రశ్న!

డిజిటల్ పంథాలో సత్వర ఆమోదం

సుప్రీంకోర్టు రాష్ట్రపతికి మాండమస్ ఉత్తర్వును జారీ చేయకూడదనే వాదన ఒకటి ముందుకొచ్చింది. దీన్ని అంగీకరించడమంటే రాజ్యాంగానికి రాష్ట్రపతి అతీతులనే వాదనను అంగీకరించడమే అవుతుంది. మన దేశంలో రాజ్యాంగానికీ, చట్టానికీ ఎవరూ అతీతులు కారు. కారణాలు చెప్పకుండా బిల్లులకు ఆమోదాన్ని నిలిపి ఉంచే అధికారాన్ని రాజ్యాంగం రాష్ట్రపతి, గవర్నర్లకు ఇవ్వలేదు. వారు మంత్రివర్గం నుంచి వివరణలు మాత్రమే కోరగలరు. రాష్ట్రాల నుంచి వచ్చే బిల్లులపై రాష్ట్రపతి మూడు నెలల్లోగా తన అభిప్రాయాన్ని వెల్లడించడానికి అన్ని ఏర్పాట్లూ చేయాలని 2016 ఫిబ్రవరిలో వివిధ ప్రభుత్వ విభాగాలకు కేంద్రం ఉత్తర్వులు పంపింది. ఈ ఉత్తర్వును సుప్రీం తీర్పులో ప్రత్యేకంగా ప్రస్తావించారు. అయినాసరే, మూడు నెలల వ్యవధిని గవర్నర్లు ఉల్లంఘించడం సరికాదు. చరమ సంధ్యలో ఉన్న రాజకీయ నాయకులకు వానప్రస్థ ఆశ్రమంగా గవర్నర్ పదవి ఉపయోగపడుతోందనే వాదనను తప్పుపట్టలేం. బిల్లుల సత్వర ఆమోదానికి ఆస్ట్రేలియా మాదిరిగా డిజిటల్ పంథాను అనుసరించడం ఉత్తమం. అక్కడ బిల్లుల ఆమోదానికి అనుసరిస్తున్న విధివిధానాలు రాజ్యాంగానికి అనుగుణంగా ఉన్నాయని న్యాయాధికారులు ఎప్పటికప్పుడు ధ్రువీకరించే పద్ధతి అమలవుతోంది.

# గ్లోబల్ వార్మింగ్‌తో విస్తరించే ప్రాణాంతక ఫంగస్! 33 శాతానికిపైగా మరణాల రేటు!




న్యూఢిల్లీ,గ్లోబల్ వార్మింగ్ వల్ల మనిషి ఆరోగ్యానికి ప్రాణాంతకంగా పరిణమించే ఫంగస్‌లు విస్తరిస్తాయని తాజాగా ఒక అధ్యయనం వెల్లడించింది. ఈ ఫంగస్ సోకిన వ్యక్తులలో కనీసం 33 శాతం మంది చనిపోయే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించింది. ఉష్ణోగ్రతలు పెరిగే కొద్దీ ఆస్పెర్‌గిల్లస్ ఫ్యూమిగాటస్ అనే ఫంగస్ విస్తరణకు వాతావరణం దోహదం చేస్తుందని పేర్కొన్నది. రోజు రోజుకూ ధరిత్రి వేడెక్కి పోతున్నది. ధృవాలు కరుగుతున్నాయి. సముద్ర జలాలు క్రమంగా వెచ్చబడుతున్నాయి. ఇవి అనూహ్యవాతావరణ పరిస్థితులకు దారి తీస్తున్నాయి. 2040 నాటికి ప్రపంచంలో కనీసం ముప్పై నగరాలు సముద్ర నీటిలో మునిగిపోతాయన్న హెచ్చరికలు శాస్త్రవేత్తల నుంచి వస్తున్నాయి. పారిశ్రామిక విప్లవం తర్వాత ప్రపంచ ఉష్ణోగ్రతల్లో పెను మార్పులు చోటు చేసుకున్నాయి. శిలాజ ఇంధనాల వినియోగం పరిస్థితిని నానాటికీ దారుణంగా దిగజార్చుతూ వస్తున్నది. దానికి తోడు యథేచ్ఛగా అటవీ సంపదను నాశనం చేస్తుండటంతో పర్యావరణ సమతుల్యం దెబ్బతింటున్నది. ఇప్పటికే మూడు వరుస సంవత్సరాలు వేసవి తీవ్రతలో కొత్త రికార్డులను నమోదు చేశాయి. ఈ పరిస్థితిని సరిదిద్దుకోకుంటే భూమిపై అనేక ప్రాంతాలు నివాసానికి అయోగ్యంగా మారిపోతాయని శాస్త్రవేత్తలు మొత్తుకుంటున్నారు. పర్యావరణ మార్పులు, గ్లోబల్ వార్మింగ్‌తో శారరకంగా అనేక ఇబ్బందులు కలగడమే కాకుండా.. కొత్త కొత్త వైరస్‌లు పుట్టుకొచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

ప్రాణాంతక ఫంగస్

గ్లోబల్ వార్మింగ్ వల్ల మనిషి ఆరోగ్యానికి ప్రాణాంతకంగా పరిణమించే ఫంగస్‌లు విస్తరిస్తాయని తాజాగా ఒక అధ్యయనం వెల్లడించింది. ఈ ఫంగస్ సోకిన వ్యక్తులలో కనీసం 33 శాతం మంది చనిపోయే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించింది. ఉష్ణోగ్రతలు పెరిగే కొద్దీ ఆస్పెర్‌గిల్లస్ ఫ్యూమిగాటస్ అనే ఫంగస్ విస్తరణకు వాతావరణం దోహదం చేస్తుందని పేర్కొన్నది. ఈ వైరస్ మనుషులకే కాకుండా, పశువులు, మొక్కలకు సైతం వ్యాపిస్తుందని తెలిపింది. దాని కారణంగా కలిగే తీవ్రమైన ఇన్‌ఫెక్షన్‌లు ప్రాణాంతంగా మారుతాయని ఆ అధ్యయనం పేర్కొన్నది. ఈ అధ్యయనానికి డాక్టర్ నార్మన్ వాన్ రిజ్న్ నేతృత్వం వహించారు. ఈ ఫంగస్ ఆశ్చర్యం కలిగించేంత వేగంగా విస్తరిస్తుందని యూనివర్సిటీ ఆఫ్ మాంచెస్టర్ నివేదిక పేర్కొంటున్నది. ఈ అధ్యయనంపై ఒక విశ్లేషణను ఫైనాన్షియల్ టైమ్స్ ప్రచురించింది. పంటలను సైతం ప్రభావితం చేసే ఈ ఫంగస్ 2100 నాటికి 16 శాతానికి పెరుగుతుందని అధ్యయనం అంచనా వేసింది. ఆస్పెర్‌గిల్లస్ ఫ్యూమిగాటస్ ఫంగస్ వల్ల మనుషుల్లో ఆస్తమా (ఉబ్బసం) తదితర రుగ్మతలతో బాధపడుతున్న వ్యక్తులను ప్రభావితం చేసే ఆస్పె ర్‌గిల్లస్ ఫ్యూమిగాటస్ 2100 నాటికి 77 శాతం వరకు వ్యాప్తి చెందుతుందని తెలిపింది. ప్రజలలో ఇన్వాసివ్ ఫంగస్ ఇన్ఫెక్షన్లకు ఆస్పెర్‌గిల్లస్ ఫ్యూమిగాటస్ ప్రధాన కారణమవుతుందని, అంతిమంగా ఆస్పెర్‌గిలోసిస్‌కు కారణమవుతుందని యుఎస్ సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (సీడీసీ) చెబుతున్నది. ఆస్పెర్‌గిల్లస్ కారణంగా కలిగే ఇన్‌ఫెక్షన్లకు చికిత్స లేదని హెచ్చరిస్తున్నది. ఫలితంగా ఈ ఇన్‌ఫెక్షన్ సోకినవారిలో మరణాల రేటు 33 శాతానికిపైగానే ఉంటుందని తెలిపింది.

ఎలా వ్యాపిస్తుంది?

ఫంగస్ ఉన్న బీజపరాగమాలను పీల్చిన వ్యక్తికి ఈ ఇన్‌ఫెక్షన్ సోకుతుంది. ప్రాణాంతక ఊపిరితిత్తుల వ్యాధులకు ఇది కారణమవుతుంది. మొదట్లో తలనొప్పి, నీరసం, దగ్గినప్పుడు రక్తం పడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ ఫంగస్ విస్తారంగా వ్యాప్తి చెందేందుకు వేడి వాతావరణం బాగా ఉపకరిస్తుందని ఎంఆర్‌సీ సెంటర్ ఫర్ మెడికల్ మైకోలజీ కో డైరెక్టర్ ఎలాయిన్ బిగ్‌నెల్ చెప్పారు. ఈ ఇన్‌ఫెక్షన్లు 50 ఏళ్ల తర్వాత ఇలానే ఉండబోవని, రూపు మార్చుకుంటాయని ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన డాక్టర్ నార్మన్ వాన్ రిజ్న్ చెప్పారు.

ఇక మనచేతిలోనే మన భవిష్యత్తు

శాస్త్రవేత్తల హెచ్చరికలు ఎల్లప్పుడూ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకునే ఉంటాయి. ఆ భవిష్యత్తు మనది.. మన పిల్లలది. మన పిల్లలకు మంచి ఫ్యూచర్ ఇవ్వాలని మనం ఎంతో సంపాదించి దాచి పెట్టడం లేదా ఇళ్లు కట్టించి ఉంచడం వంటివి చేస్తుంటాం. అయితే.. వారు మనం సంపాదించినదాన్ని వాడుకోవాలన్నా, మనం కట్టించిన ఇళ్లల్లో సుఖంగా జీవించాలన్నా అన్నింటికంటే ముఖ్యమైనది అద్భుతమైన పర్యావరణం. ప్రత్యేకించి కోట్లకు కోట్లు వెనకేసుకునేవారు ఆ కోట్ల రూపాయల ఆస్తులను మీ పిల్లలు అనుభవించాలంటే.. ముందుగా మీరు చేయాల్సిన పని.. పర్యావరణ పరిరక్షణ.

# సినిమా ఇంకా ఉంది.. ఇండియాది పెద్ద ప్లానే..

న్యూఢిల్లీ,ఉగ్రదాడులకు తిరిగి దాడులతోనే సమాధానం చెప్పింది భారత్. ఎక్కడా సామాన్య పౌరులపై అటాక్ చేయలేదు.. పాక్ ఆర్మీ మిలటరీ ఎస్టాబ్లిష్‌మెంట్స్ జోలికి వెళ్లలేదు. ఈ దాడులను సాకుగా చూపి పాకిస్థాన్ ఏదైనా కొత్త ఎత్తుగడలు వేసినా.. దాడులు చేసినా.. మీ బెండు తీసేందుకు రెడీగా ఉన్నామంటోంది ఇండియన్ ఆర్మీ. ఇప్పటికే LOCలో సామాన్య గ్రామాలపై అక్కడక్కడ తమ ప్రతాపం చూపుతున్న పాక్ ఆర్మీకి దిమ్మతిరిగే వార్నింగ్ ఇచ్చింది ఇండియన్ ఆర్మీ.

మీ ఇంటికొచ్చి చంపేస్తాం..

మీరు లైన్ క్రాస్ చేస్తే ఏం చేయాలో మాకు తెలుసు.. మేం సిద్ధంగా ఉన్నామని చెప్పారు వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్. పాక్ తోక జాడితే బుద్ధి చెప్పేందుకు ఫుల్‌గా ప్రిపైర్ ఉన్నామన్నారు. నిజానికి ఈ విషయం ఇప్పటికే పాకిస్థాన్ ఆర్మీకి అర్థమై ఉంటుంది. ఎందుకంటే దాడులు కేవలం పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో మాత్రమే జరగలేదు. నేరుగా పాకిస్తాన్‌లో కూడా జరిగాయి. మొత్తం 9 స్థావరాలపై దాడులు చేస్తే.. అందులో నాలుగు పాకిస్తాన్‌లోనే ఉన్నాయి. దీన్ని బట్టి పాక్‌లోని ఏ టార్గెట్ కూడా తమ నుంచి తప్పించుకోలేదని తేల్చి చెప్పినట్టైంది. దాయాది దేశంపై దాడి చేయటం తమకు చాలా ఈజీ పని అని.. ఎవరూ అడ్డుకోలేరని బాగా అర్థమయ్యేలా చాటిచెప్పింది.

పాక్ ఆయువుపట్టుపై అటాక్

పాకిస్తాన్‌లోని బవహల్పూర్ ఉగ్ర క్యాంప్‌పై దాడి జరుగుతుందని ఆ దేశం కలలో కూడా ఊహించి ఉండదు. జైషే, లష్కరే మూకలకు చెందిన ప్రధాన కార్యాలయాలు అక్కడే ఉన్నాయి. అన్నిటికీ మించి పాక్ ఆర్మీ రెజిమెంటర్ సెంటర్ కూడా బవహల్పూర్‌లోనే ఉంది. లెటెస్ట్‌గా ఈ సెంటర్‌లో రాడార్‌లను మోహరించారన్న వార్తలు కూడా వచ్చాయి. కానీ ఇవేవీ కూడా భారత దాడులను అడ్డుకోలేకపోయాయి. అదీ మన ఆర్మీ సత్తా.

మరో 12 ఉగ్ర క్యాంపులపై అటాక్?

ఇండియన్ ఇంటెలిజెన్స్ రిపోర్టుల ప్రకారం మొత్తం 21 ఉగ్ర స్థావరాలను గుర్తించినట్టు తెలుస్తోంది. బుధవారం తెల్లవారుజామున కేవలం 9 టెర్రర్ క్యాంపులపైనే దాడులు జరిగాయి. మిగతా 12 స్థావరాలను కూడా భారత ఆర్మీ టార్గెట్ చేసుకున్నట్టు సమాచారం. వాటిపై భారత్ ఎప్పుడు దాడి చేస్తుందో అని వణికిపోతున్నారు ఉగ్రవాదులు. అంతేకాదు దేశంలో కూడా మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నారు. సెలవుల్లో ఉన్న పారామిలటరీ బలగాలను వెంటనే తిరిగి డ్యూటీలో చేరాలని ఆదేశించారు. భారత్–పాక్ సరిహద్దుల్లో IAF డ్రిల్స్ కొనసాగుతూనే ఉన్నాయి. మొత్తంగా చూస్తే.. ఇంకా ఏదో పెద్దగానే జరగబోతుందని తెలుస్తోంది.

పిక్చర్ అబీ బాకీ హై..




సినిమా అప్పుడే అయిపోలేదు.. ఇంకా చాలా ఉంది అంటున్నారు ఇండియన్ ఆర్మీ మాజీ ఉన్నతాధికారులు. రిటైర్ట్ ఇండియన్ ఆర్మీ మాజీ జనరల్ మనోజ్ ముకుంద్ నరవణే అయితే అబీ పిక్చర్ బాకీ హై.. అంటూ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. ఆయన ట్వీట్‌ను బట్టి చూస్తే భారత్ ఇంకా ఏదో పెద్దగానే ప్లాన్ చేసినట్టు కనిపిస్తోంది. ఉగ్రవాదులకు రాసే రక్త చరిత్రలో ఇది పార్ట్ 1 అని మాత్రమే అనిపిస్తోంది.

లంకా దహనం చేసినట్టే..

హనుమాన్ లంకా దహనం చేసినట్లే.. మన సైన్యం ఉగ్రవాదులపై దాడి చేసిందన్నారు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్‌కు గట్టి సమాధానం ఇచ్చామని చెప్పారు. ఉగ్రమూకలను సైన్యం వెంటాడి మట్టుబెట్టిందన్నారు. పౌరుల ప్రాణాలకు ఎలాంటి నష్టం లేకుండా ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేసినట్లు చెప్పారు. రైట్ టు రెస్పాండ్ హక్కును వాడుకున్నామని తెలిపారు. అమాయకులను చంపిన వారినే మట్టుబెట్టామన్నారు రాజ్‌నాథ్ సింగ్. మోడీ నేతృత్వంలో భారత్ సగర్వంగా తలెత్తుకుందన్నారు. ఉగ్రవాదుల స్థైర్యాన్ని బలంగా దెబ్బతీశామన్నారు. త్రివిధ దళాలకు దేశం మొత్తం సెల్యూట్ చేస్తోందన్నారు రాజ్‌నాథ్. మన లక్ష్యం పాక్ పౌరులు కాదన్న ఆయనదేశ భద్రతకు భంగం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ఆర్మీకి ఫుల్ సపోర్ట్

దేశ రక్షణ విషయంలో అందరూ ఐక్యంగా ఉండాలన్నారు కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే. సైనికులు తీసుకునే ప్రతి నిర్ణయానికి కాంగ్రెస్ మద్దతు ఉంటుందని చెప్పారు. ఢిల్లీలో భారత్–పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నేతల కీలక భేటీ జరిగింది. మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ సహా ముఖ్య నేతలంతా హాజరయ్యారు. మరోవైపు ఆపరేషన్ సిందూర్‌పై గురువారం అఖిలపక్ష సమావేశానికి పిలుపునిచ్చిన కేంద్రం. ఉదయం 11 గంటలకు పార్లమెంటులో అఖిలపక్ష సమావేశం జరగనుంది

# దేశవ్యాప్తంగా 18 విమానాశ్రయాల మూసివేత

న్యూఢిల్లీ, పహల్గాం ఉగ్రదాడికి భారత్ గట్టిగా ప్రతీకారం తీర్చుకుంది. ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్థాన్, పీఓకేలోని 9 ఉగ్ర స్థావరాలపై మెరుపు దాడులకు పాల్పడింది. ఈ పరిణామాల నేపథ్యంలో భారత గగనతలంలో కొంత మేర కేంద్రం ఆంక్షలు విధించింది. దీంతో ఇప్పటికే అనేక విమాన సర్వీసులు రద్దయ్యాయి. బుధవారం ఉదయం నుంచి దేశవ్యాప్తంగా 18 విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేశారు. శ్రీనగర్, లేహ్, అమృత్‌సర్, చండీగఢ్ సహా పలు ఎయిర్‌పోర్టుల్లో రాకపోకలు నిలిచి పోయాయి. ఈ నెల పదివారకు ఆయా విమానాశ్రయాల నుంచి రాకపోకలను నిషేధించారు. అలాగే విమానసర్వీసులను రద్దుచేశారు. ఈ క్రమంలోనే ప్రముఖ విమానాయాన సంస్థ ఇండిగో కీలక ప్రకటన చేసింది. మే 10వ తేదీ వరకు 165కు పైగా విమానాలను రద్దు చేస్తున్నట్లు– ప్రకటించింది. గగనతలంపై ఆంక్షల నేపథ్యంలో అమృత్‌సర్, బికనేర్, చండీగఢ్, ధర్మశాల, గ్వాలియర్, జమ్మూ, జోధ్‌పూర్, కిషన్‌గఢ్, లేహ్, రాజ్‌కోట్, శ్రీనగర్ సహా పలు ఎయిర్‌పోర్టుల నుంచి మే 10వ తేదీ ఉదయం 5.30 గంటల వరకు 165కి పైగా విమాన సర్వీసులను రద్దు చేస్తున్నామని ఇండిగో ఓ ప్రకటనలో వెల్లడించింది. ప్రయాణికులు ఎప్పటి కప్పుడు అప్‌డేట్‌లను చూసుకోవాలని తెలిపింది. ఆయా విమాన ప్రయాణికులు రీషెడ్యూల్ లేదా టికెట్ క్యాన్సిల్ చేసుకునే సదుపాయం కల్పిస్తున్నట్లు– వెల్లడించింది. ఇందుకు ఎలాంటి అదనపు ఛార్జీలు లేవని, క్యాన్సిల్ చేసుకుంటే పూర్తి రీఫండ్ కూడా ఇస్తామని పేర్కొంది. ఎయిర్‌ఇండియా కూడా ఇదే విధమైన ప్రకటన చేసింది. మే 10వ తేదీ ఉదయం వరకు శ్రీనగర్, జమ్మూ, లేహ్, జోధ్‌పూర్, అమృత్‌సర్, భుజ్, జామ్‌నగర్, రాజ్‌కోట్, చండీగఢ్ ఎయిర్‌పోర్టులకు తమ విమానాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు– వెల్లడించింది. ప్రయాణికులకు వన్–టైమ్ రీషెడ్యూల్ ఛార్జీల మినహాయింపు కల్పించింది. లేదా పూర్తి రీఫండ్ ఇస్తామని తెలిపింది. స్పైస్‌జెట్, ఎయిర్‌ఇండియా ఎక్స్‌ప్రెస్, ఆకాశ ఎయిర్ విమానాలు కూడా రద్దయ్యాయి.

## భూమిని లాగేసుకున్న వైకాపా నేతలు

ఒంగోలు, మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఉదయం పురుగుల మందు డబ్బాలతో బోడపాడు రైతు కుటుంబం ధర్నా చేపట్టింది. తమ భూమిని గత వైసిపి ప్రభుత్వంలో వైసీపీ సర్పంచ్ బంధువులు అక్రమంగా ఆన్‌లైన్ చేసుకున్నారని బాధితులు వాపోయారు. భూమి విషయాన్ని అడిగితే తమపై దాడి చేశారని కన్నీటి సంద్రమయ్యారు. అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నప్పటికీ స్పందించడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

# సైన్యానికి బాసటగా నిలిచిన చిత్రరంగం

న్యూఢిల్లీ, పహల్గాం ఉగ్ర దాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుంటోంది. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం విరుచుకుపడింది. పహల్గాం మృతులకు న్యాయం చేసేందుకే ఈ దాడులు చేసినట్లు– కేంద్ర విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ తెలిపారు. దీంతో ప్రస్తుతం సోషల్ మీడియా అంతా భారత సైన్యానికి జేజేలు పలుకుతోంది. 'భారత్ మాతా కీ జై', 'మేమంతా మీ వెంటే' అంటూ నెటిజన్‌లు, ప్రముఖులు పోస్ట్‌లు పెడుతున్నారు. తాజాగా మలయాళ అగ్ర కథానాయకుడు మోహన్‌లాల్ పెట్టిన పోస్ట్ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. మేం సిందూరాన్ని సంప్రదాయ తిలకంగా మాత్రమే కాదు.. మా అచంచలమైన సంకల్పానికి చిహ్నంగా కూడా ఉపయోగిస్తాం. మాకు ఎన్ని సవాళ్లు ఎదురైనా.. నిర్భయంగా, గతం కంటే బలంగా వస్తాం. భారత సైన్యం, నౌకాదళం, వైమానిక దళం, బీఎస్ఎఫ్‌లోని ప్రతీ ధైర్యవంతుడికి వందనాలు. మీ అందరి ధైర్యం మా గర్వాన్ని మరింత పెంచుతుంది. మిమ్మల్ని చూసి దేశమంతా గర్విస్తోంది. జైహింద్ అని మోహన్‌లాల్ పోస్ట్ పెట్టారు. 'ఆపరేషన్ సిందూర్'పై సినీ ప్రముఖులు కూడా స్పందించారు. ఉగ్రదాకి తగిన న్యాయం జరిగింది. మేరా భారత్ మహాన్. సైనికులకు సెల్యూట్ అని మహేశ్‌బాబు పేర్కొన్నారు. మన ఆర్మీ క్షేమంగా ఉండాలని ప్రార్థిస్తున్నా. జైహింద్ అంటూ ఎన్టీఆర్ పోస్ట్ చేశారు. రియల్ హీరోలకు సెల్యూట్. దేశం కోసం ఇండియన్ ఆర్మీ ఏం చేయగలదో 'ఆపరేషన్ సిందూర్'తో మరోసారి రుజువైంది. దేశం గర్వపడేలా చేశారు. జైహింద్ అని నటుడు మమ్ముట్టి తెలిపారు. సాయుధ దళాలు ఒక్క–టైన వేళ.. గర్వంగా ఉంది. భారత ప్రభుత్వం తీసుకున్న వ్యూహాత్మక సైనిక చర్యను అభినందిస్తున్నానని కమల్ హాసన్ అన్నారు. జైహింద్.. ఆపరేషన్ సిందూర్ అంటూ నాని పోస్ట్ చేశారు. పహల్గాం ఉగ్రదాడికి సమాధానం 'ఆపరేషన్ సిందూర్'. జైహింద్ అని కల్యాణ్‌రామ్ లన్నారు. ఇదీ భారతసైన్యం.. జైహింద్ అని శివ కార్తికేయన్ ప్రకటించారు. 'ఆపరేషన్ సిందూర్' కలిసి నిలబడదామంటూ ప్రముఖుల పోస్ట్‌లు.. పెట్టారు.

# కట్టడి సాధ్యమేనా?

హైదరాబాద్,ఆదిమ మానవ సమాజం ప్రకృతిలో లభించే ఆకులు, పండ్లు, వేర్ల ద్వారా మత్తు పదార్థాలను ఒక సమూహం ఔషధాలుగా స్వీకరించింది. మరో సమూహం ఆ మత్తును దేవతల అనుగ్రహంగా భావించింది. శ్రామిక సమూహం ఆ మత్తు పదార్థాల ద్వారా ఉపశమనం కోరుకుంది. అయితే సమాజంలో మత్తు పదార్థాలు అనేక సామాజిక రుగ్మతలకు కారణమవుతున్నాయని ప్రపంచ తత్వవేత్తలందరూ దీనిని నిషేధించాలని పిలుపునిచ్చారు. కానీ నేడు ప్రభుత్వాలు.. పాలకులుగా ఉన్న దోపిడీ వర్గాలు వెనుకబడిన వర్గాలను మద్యం మత్తులో ఉంచి వారు రాజకీయ అధికార మత్తులో తేలుతున్నారు.

మూలాలపై శ్రద్ధ పెట్టకుండా..

తెలంగాణ రాష్ట్రం మద్యం విక్రయాల్లో దక్షిణ భారతంలోనే ముందంజలో ఉంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం మద్యపాన వ్యసనంలో 43%తో తెలంగాణ దేశంలోనే మూడో స్థానంలో ఉంది. మద్యంతో పాటు రాష్ట్రంలో విస్తృతంగా లభ్యమవుతున్న గంజాయి, డ్రగ్స్ ఇటు సామాన్యుల్లోనూ అటు సామాజిక ఆలోచనా పరుల్లోనూ గుబులు పుట్టిస్తుంది. గంజాయి, డ్రగ్స్ తీసుకుంటున్న వారిలో దాదాపు 80 శాతానికి 15 నుండి 29 వయసు మధ్యవారు ఉండడం రాష్ట్ర భవిష్యత్‌కి భయాందోళనం. ఇటీవల నిర్వహించిన కమ్యూనిటీ ఎగైనెస్ట్ డ్రంక్ అండ్ డ్రైవ్ సర్వే ప్రకారం 35% మంది 18 నుంచి 25 సంవత్సరాల యువకులే.. ఇంతకుముందు పట్నానికి పరిమితమై ఉన్న మత్తు పదార్థాలు నేడు బేషరతుగా పల్లెల్లో, పల్లె యువతలో చెక్కర్లు కొడుతున్నాయి. ఈ తెలంగాణ గడ్డకు ఇటువంటి సామాజిక చీడలను ఎదురుకున్న చరిత్ర కోకొల్లలుగా ఉన్నప్పటికీ.. మద్యం మత్తు పీడనలకు నేడు బలైపోతుంది. నేడు ప్రభుత్వాలు ఆదాయానికి మద్యమే ప్రధాన వనరుగా విస్తృతంగా ప్రోత్సహిస్తున్నాయి. పట్నం చుట్టూరా రోజురోజుకు వంద కిలోల గంజాయి పట్టుబడుతున్న ప్రభుత్వాలు వాటి మూలా లపై శ్రద్ధ పెట్టడం లేదు. ఇక సరైన పర్యవేక్షణ లేని పల్లెల పరిస్థితి అగమ్యగోచరమే. ముఖ్యంగా టీనేజ్ యువత మద్యానికో.. మత్తు పదార్థాలకో బానిసలై బంగారు భవిష్యత్‌ను కోల్పోతున్నారు.

కట్టడి చేయాలని ఆదేశించినప్పటికీ..

గత ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని పూర్తిగా మద్యం మత్తులో ముంచుతుందని విమర్శ చేసి, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బెల్ట్ షాపులను మూసి వేస్తామని హామీ ఇచ్చింది. కానీ నేడు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించి బహిరంగంగా మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తుంది. ఈ పార్టీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో కొత్త బార్‌లకు పర్మిషన్ ఇచ్చుడే కాక.. కొత్త మద్యం బ్రాండ్‌లను కూడా అనుమతించింది. ఇటీవల మద్యంపై ధరలు పెంచింది. ఒకవైపు ప్రజా సంక్షేమం అంటూ వేల కోట్లతో అనేక పథకాలను రూపొందిస్తూ.. మరోవైపు మద్యం మత్తెక్కించి ప్రజలను దోచుకుంటుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొదట్లో మాదకద్రవ్యాల కట్టడికి ఉక్కుపాదం మోపాలని అధికారులను ఆదేశించినప్పటికీ.. రానురానూ మాదకద్రవ్యాలు వాటిని సరఫరా చేసే ముఠాలు ఊట శెలిమెల్లాగ పుట్టుకొస్తున్నాయి. మెల్లగా పట్నం నుండి పల్లెకు పాకిన గంజాయి డ్రగ్స్ లేలేత యువతను చిదిమేస్తున్నాయి. అందుకే ఇప్పటికైనా ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ పెట్టి రాష్ట్రంలోకి మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు రా కుండా కట్టడి చెయ్యాలి. మద్యం సీసాల్లో కూరుకుపోతున్న కుటుంబాలను ఒడ్డుకు చేర్చాలి. తెలంగాణ ఆడబిడ్డలు ప్రభుత్వంపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి.

## అంతం కాదిది..ఆరంభం మాత్రమే

న్యూఢిల్లీ,అంతం కాదిది ఆరంభం అని భారత ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ నరవణే కీలక వ్యాఖ్యలు చేశారు. సినిమా అప్పుడే అయిపోలేదు..ఇంకా ఉంది' అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా.. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం విరుచుకుపడిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో భారత ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ నరవణే కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్ర స్థావరాలపై దాడిని ఉద్దేశిస్తూ..మాజీ చీఫ్‌ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ శంకర్ రాయ్ చౌదరి కూడా స్పందించారు. ఉగ్రస్థావరాలపై భారత బలగాలు చేసిన దాడిని అద్భుతమైన ప్రణాళికతో కూడిన గొప్ప ఆపరేషన్‌గా ప్రశంసించారు. ఈ దాడులను భారత్ ఆపకూడదని.. కొనసాగించాలని సూచించారు. ఇది యుద్ధం లాంటి పరిస్థితి కాదని.. ఇప్పటికే ఇరుదేశాల మధ్య అప్రకటిత యుద్ధం కొనసాగుతోందని అన్నారు. దాడుల సమయంలో మాజీ ఆర్మీ చీఫ్‌ల నుంచి ఈతరహా స్పందన రావడం గమనార్హం. పాకిస్థాన్, పీఓకేలోని తొమ్మిది ఉగ్ర స్థావరాలపై మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత భారత్ పెద్దఎత్తున విరుచుకుపడింది. భారత్‌పై సీమాంతర ఉగ్రదాడులకు కుట్ర పన్నినట్లు– భావిస్తున్న మొత్తం తొమ్మిది స్థావరాలపై ఆర్మీ దాడులు చేపట్టి.. 'ఆపరేషన్ సిందూర్ ' విజయవంతంగా నిర్వహించినట్లు– సైన్యం ప్రకటించింది. ఈ మెరుపు దాడులకు సంబంధించిన వివరాలను కేంద్ర రక్షణ, విదేశాంగ

# ఆపరేషన్ సింధూర్ పై లోకేశ్ హర్షం

అమరావతి,పాక్‌లో ఉగ్రవాదుల భరతం పట్టేలా భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై ఏపీ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. పహల్గాం దాడికి ప్రతీకారంగా ఉగ్రవాదుల స్థావరాలను నేలమట్టం చేయడంపై ఆయన హర్షం వ్యక్తంచేశారు. మన నేలపై మొలిచిన మొక్క కూడా పీకలేరు! వంద పాకిస్థాన్‌లకు సమాధానం చెప్పే మిసైల్ పేరు మోదీ అని పేర్కొంటూ ఓ ప్రత్యేక వీడియోను 'ఎక్స్'లో షేర్ చేశారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ అమరావతి పునఃప్రారం భోత్సవ వేడుకలకు విచ్చేసిన సందర్భంలో తాను చేసిన ప్రసంగంలోని కొన్ని పాయింట్లు-, పాక్ ఉగ్రవాద స్థావరాలపై సైన్యం జరిపిన దాడుల దృశ్యాలు, ప్రధాని మోదీ ప్రసంగంలోని కొన్ని మాటలతో కలిపి 54 సెకన్ల నిడివి కలిగిన వీడియోను ఆయన పంచుకున్నారు. అంతకుముందు ఈ అంశంపై ట్వీట్ చేసిన లోకేశ్ 'భారతదేశ సార్వభౌమత్వాన్ని పరీక్షించేందుకు ధైర్యం చేసేవారికి ఇదో గట్టి సందేశం. ప్రధాని నరేంద్ర మోదీ దృఢమైన నాయకత్వంలో భారత్ అచంచలమైన దృఢ సంకల్పంతో కచ్చితంగా ప్రతిదాడి చేస్తుంది. ప్రధాని మోదీకి హృదయపూర్వక అభినందనలు. ఆయన ధైర్యం, దేశ భద్రత పట్ల అంకితభావం.. పాక్‌ను భయభ్రాంతులకు గురిచేశాయి. భారతీయులందరూ గర్వపడేలా చేశాయి. భారత్ ఐక్యంగా ఉంది.ఈ భూమిపై ఏ శక్తీ మన స్ఫూర్తిని విచ్ఛిన్నం చేయలేదని పేర్కొన్నారు.

# ఓ వైపు ఆపరేషన్ సింధూర్

న్యూఢిల్లీ,పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు భగ్గుమంటున్న వేళ... 'ఆపరేషన్ సిందూర్'పేరిట భారత్ మెరుపు దాడులతో గట్టి సమాధానం ఇచ్చింది. అది జీర్ణించుకోలేని పాకిస్థాన్ తామూ దాడులు చేస్తామని ప్రేలాపనలు పేలుతోంది. మరోవైపు దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సంక్షోభ సమయంలో పౌరులు ప్రాణాలు ఎలా కాపాడుకోవాలో అన్న అంశంపై అవగాహన కల్పించాలని కేంద్రహోం శాఖ నిర్ణయించింది. దానిలో భాగంగా దేశవ్యాప్తంగా సాయంత్రం నాలుగు గంటలకు మాక్ డ్రిల్స్ ప్రారంభమయ్యాయి. ఈ మాక్ డ్రిల్స్‌లో పాల్గొనాలని ఆయా జిల్లా అధికార యంత్రాంగాలు, సివిల్ డిఫెన్స్ వార్డెన్లు, వాలంటీర్లు, హోమ్‌గార్డ్స్, ఎన్‌సీసీ కోర్, ఎన్‌ఎస్‌ఎస్, నెహ్రూయువ కేంద్ర సంఘటన్, కాలేజ్‌లు, స్కూల్ విద్యార్థులకు ఇప్పటికే కేంద్రం పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే.దేశవ్యాప్తంగా 244 జిల్లాల్లోని 259 లొకేషన్లలో మాక్ డ్రిల్స్ నిర్వహించారు. దాదాపు 50 సంవత్సరాల తర్వాత దేశ వ్యాప్తంగా మాక్ డ్రిల్స్ చేపట్టడం గమనార్హం. కార్గిల్ యుద్ధ సమయంలో అవి సరిహద్దు జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్ వంటి సరిహద్దు రాష్ట్రాలకే పరిమితం అయ్యాయి. ఈ సారి మాత్రం దేశవ్యాప్తంగా కీలక ప్రదేశాల్లో వీటిని నిర్వహిస్తున్నారు. శత్రు యుద్ధ విమానాలు, క్షిపణులు, డ్రోన్లు దూసుకొస్తున్న వేళ ప్రజల సన్నద్ధత కోసం వీటిని నిర్వహిస్తున్నారు. ఇందులో సైరన్ అత్యంత కీలకమైంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సైరన్ మోతలు వినిపించాయి.

# చుట్టుముడుతున్న సమస్యలు

హైదరాబాద్, తెలంగాణ రోడ్డు రవాణ సంస్థ (టీజీఆర్టీసీ) ఉద్యోగులు సమ్మెకు సిద్ధమయ్యారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ బస్సులు ఎక్కడికక్కడే ఆగిపోనున్నాయి. మే 7వ తేదీ నుంచి సమ్మెలోకి వెళుతున్నట్టు సంస్థ జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. తమ దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కొద్ది రోజుల క్రితం తెలంగాణ రోడ్డు రవాణ సంస్థ ఉద్యోగులు యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చారు. సమస్యలను పరిష్కరించేందుకు తమను చర్చలకు పిలవాల్సిందిగా సమయం ఇచ్చినా యాజమాన్యం స్పందించకపోవడంతో ప్రత్యక్షంగా రంగంలోకి దిగారు. సోమవారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కార్మిక సంఘాల నేతలను చర్చలకు ఆహ్వానించారు. సమ్మె చేయవద్దని వారిని కోరారు. ఆర్టీసీ ఇప్పుడిప్పుడే లాభాల బాటలో పడుతున్నదని చెబుతూ.. కార్మికుల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కానీ, ప్రభుత్వం తరఫున చేయాల్సిన పనులపై స్పందించకపోవడంతో జేఏసీ నాయకులు ఆగ్రహంగా బయటకు వచ్చారు. ముందుగా ప్రకటించిన కార్యాచరణ ప్రకారం ఎట్టి పరిస్థితుల్లో వెనక్కి తగ్గేది లేదని, ముందుకు వెళ్తామని ఆయనకు స్పష్టం చేశారు. సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో సోమవారం ఆర్టీసీ క్రాస్ రోడ్డు నుంచి బస్సు భవన్ వరకు కవాతు నిర్వహించారు. పోలీసులు ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున మోహరించి నిలువరించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ కార్మికులు, ఉద్యోగులు బస్‌భవన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఉద్యోగులు సమ్మెకు దిగితే పరిస్థితి ఏంటనే దానిపై ప్రభుత్వ పెద్దలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో పాటు చర్చలకు పిలిచేందుకు మంత్రి వర్గ ఉపసంఘం వేయాల్సిన ఆవశ్యకత ఉందని ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు.

మే 15 నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయులు రంగంలోకి

ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చూపుతున్న ఉదాసీనత, అలసత్వం 13 లక్షల 31 వేల కుటుంబాలను సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయుల కార్మికుల పెన్షనర్స్ ఐక్యకార్యచరణ సమితి (టీజీఈ జాక్) చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల సమ్మెకు తోడు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు కూడా ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. ఏడాదిన్నర కాలంగా వేచి చూస్తున్నామని, ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదని ఆగ్రహంతో ఉన్న వీరు ఆదివారం నాడు బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశమయ్యారు. కొత్త ప్రభుత్వం అని ఇప్పటి వరకు ఓపిక వహించామని, సహనం నశించి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయుల కార్మికుల పెన్షనర్స్ ఐక్యకార్యాచరణ సమితి సదస్సులో ప్రకటించారు. సమితి చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావుతో పాటు వివిధ సంఘాల నాయకులు హాజరయ్యారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే మే నెల 15న హైదరాబాద్ తో పాటు జిల్లాల్లో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రభుత్వ కార్యాలయాల ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శనలు చేపడ్తామని తెలిపారు. వర్క్ టూ రూల్, మానవ హారాలు, సామూహిక భోజనాలు, పెన్ డౌన్, సామూహిక సెలవులు పెట్టి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామన్నారు. అప్పటికీ విన్పించుకోనట్లయితే జూన్ 9న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా, ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ప్రతి ఐదు సంవత్సరాలకు పాలకులు మారుతుంటారని, ఉద్యోగులు శాశ్వతంగా ఉంటారని అన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఎంత వరకైనా వెళ్తామని సదస్సులో పాల్గొన్న నేతలు స్పష్టం చేశారు. తెలంగాణ సమాజం ఎల్లకాలం ఏ అణచివేతను, సాచివేతను, ఆగచాట్లను అవమానాలను భరించిన చరిత్ర లేదని జేఏసీ నాయకులు వెల్లడించారు. అయితే సోమవారం నాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ, ఒకటో తేదీన జీతాలు ఇస్తున్న

# పాక్‌కు డ్రాగన్ దెబ్బ.. పరోక్షంగా ఇండియాకు సహకరించిన చైనా!




న్యూఢిల్లీ,బుధవారం తెల్లవారు ఝామున సరిగ్గా ఒంటి గంటా 44 నిమిషాలకు పాక్ ఆక్రమిత కాశ్మీర్ లోని 9 స్థావరాలను భారత్ టార్గెట్ చేసింది, బాంబుల వర్షం కురిపించింది. వాస్తవానికి ఇలాంటి వైమానిక దాడుల్ని ముందుగానే పసిగట్టడానికి రాడార్ వ్యవస్థ ఉంటుంది. రాడార్ వ్యవస్థ సమర్థంగా పనిచేస్తే.. ఈ దాడుల్ని ముందుగానే పసిగట్టి నష్ట నివారణ చర్యలు చేపట్టవచ్చు. దాడుల్ని ఆపలేకపోవచ్చు కానీ.. ఆస్తినష్టం, ప్రాణ నష్టాన్ని కాస్తయినా తగ్గించవచ్చు. కానీ పాకిస్తాన్ లోని రాడార్ వ్యవస్థ ఈ విషయంలో పూర్తిగా ఫెయిలైంది. దాడి జరిగిన తర్వాతే పాక్ కి ఆ విషయం తెలిసొచ్చింది. కారణం.. పాక్ వాడిన చైనా రాడార్లు.

అంత సీన్ లేదు..

యుద్ధానికి సిద్ధం, సరైన బదులిస్తాం, ధీటుగా ప్రతిఘటిస్తామంటూ పాకిస్తాన్ ఎప్పుడూ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తుంటుంది కానీ, యుద్ధమే వస్తే భారత్ ని తట్టుకునే శక్తి పాక్ కి లేదనే విషయం ప్రపంచం మొత్తానికీ తెలుసు. బాలాకోట్ పై వైమానిక దాడుల సమయంలో కూడా పాకిస్తాన్ నిఘా వ్యవస్థ సరిగా పనిచేయలేదు. ఆ తర్వాత భారత్ బ్రహ్మోస్ క్షిపణిని ప్రయోగించింది. అప్పుడు కూడా పాక్ ఆ విషయాన్ని పసిగట్టలేకపోయింది. ఇప్పుడు ఆపరేషన్ సిందూర్ ని పాక్ రాడార్ వ్యవస్థ గుర్తించలేకపోయింది. అంటే ఆ దేశ నిఘా వ్యవస్థ ఏ స్థాయిలో నిద్రపోతోందో అర్థం చేసుకోవచ్చు. పాకిస్తాన్ వైమానిక రక్షణ మౌలిక సదుపాయాలు దారుణంగా ఉన్నాయని ఈ ఘటన నిర్ధారించింది.

మేడిన్ చైనా రాడార్లు

2019లో బాలాకోట్ పై భారత్ వైమానిక దాడి చేసింది. పాకిస్తాన్ రాడార్ కవరేజ్ కి అందకుండా ఈ దాడి జరిగింది. బాలాకోట్ దాడి తర్వాత పాకిస్తాన్ అలర్ట్ అయింది. చైనా నుండి వాయు రక్షణ వ్యవస్థలను కొనుగోలు చేసింది. అయితే ఆ రక్షణ వ్యవస్థలు దారుణంగా ఫెయిలయ్యాయి. ఆ విషయం బ్రహ్మోస్ పరీక్షతో రుజువైంది. 2022 మార్చిలో భారత్ బ్రహ్మోస్ క్షిపణిని ప్రయోగించింది. హర్యానాలోని అంబాలా నుండి సూపర్‌సోనిక్ బ్రహ్మోస్ క్రూయిజ్ క్షిపణిని భారత్ ప్రయోగించగా, పాక్ దాన్ని గుర్తించలేకపోయింది. ఈ క్షిపణి భారత గగనతలంలో 100 కిలోమీటర్లు, పాకిస్తాన్ గగన తలంపై 105 కిలోమీటర్లు ప్రయాణించి చివరకు పంజాబ్ ప్రావిన్స్‌లోని మియాన్ చన్నులో లక్ష్యానికి చేరుకుంది. పాక్ గగన తలంపై 105 కిలోమీటర్ల మేర మన క్షిపణి వెళ్లినా.. పాక్ రాడార్ పసిగట్టలేకపోయింది. బ్రహ్మోస్ క్షిపణి ప్రయోగం పూర్తయిన తర్వాతే పాక్ కి ఆ విషయం తెలిసింది.

ఇప్పుడు కూడా..

వాస్తవానికి 2014లో భారత్ లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. పాక్ కాస్త అలర్ట్ అయింది. చైనా నుండి 9 డిఫెన్స్ సిస్టమ్స్ ని కొనుగోలు చేసింది. LY-80 LOMADS అనే పేరుతో పిలవబడే ఈ రక్షణ వ్యవస్థ అత్యంత అధునాతనమైనదని పాక్ ప్రచారం చేసుకుంది.

చైనా కూడా ఇది టాప్ ఎండ్ సిస్టమ్ అని పాక్ కి అంటగట్టింది. అయితే దాని పనితీరు సరిగా లేదు. అంచనాలను ఏమాత్రం అందుకోలేకపోయింది LOMADS వ్యవస్థ.చైనా చీప్ క్వాలిటీ సరుకు గురించి మనకు తెలిసిందే కదా. అయితే పాక్ కి దిక్కులేక చైనా నుంచి ఆ రాడార్లను కొనుగోలు చేసింది. వాటి పనితీరు సరిగా లేదంటూ పాకిస్తాన్ గతంలోనే చైనాకు ఫిర్యాదు చేసింది. LY-80 వ్యవస్థలో 388 లోపాలున్నట్టు గుర్తించింది. వీటిలో కొన్నిటిని చైనా సరిచేసింది. మిగతా లోపాలతోనే ఆ వ్యవస్థను పాక్ ఉపయోగించుకుంటోంది.

చైనా దెబ్బ..

2017లో పాకిస్తాన్ సైన్యంలో చేరిన %హ్%-80 వ్యవస్థ, 15 మీటర్ల నుండి 18 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న క్షిపణుల జాడ పసిగట్టగలదని చైనా హామీ ఇచ్చింది. 40 కిలోమీటర్ల పరిధిలో క్షిపణులు, విమానాలను అడ్డుకోగలదని కూడా తెలిపింది. ఏకంగా 150 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను కూడా గుర్తిస్తుందని ఊదరగొట్టింది. కానీ అవేవీ సాధ్యం కాలేదు. కనీసం దాడి జరిగే వరకు కూడా పాక్ కి ఆపరేషన్ సిందూర్ గురించి తెలియనే తెలియదు. పాకిస్తాన్ పై భారత్ దెబ్బకంటే, చైనా దెబ్బ గట్టిగా పడినట్టుంది. భారత్ కి చైనా, పాక్ ఉమ్మడి శత్రువులు కావడంతో చైనా నుంచి తమకు సహకారం అందుతుందని పాక్ అంచనా వేసింది. కానీ చీప్ క్వాలిటీ రాడార్లను అంటగట్టి చైనా తమని ఇలా మోసం చేస్తుందని మాత్రం ఊహించలేకపోయింది.

# భారత్ ఓపికను పరీక్షించిన పాక్

న్యూఢిల్లీ,పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. ఆపరేషన్ సింధూరంతో దాడులు చేసి వందమంది ఉగ్రమూకలను మట్టుబెట్టింది. ఇంతకాలం ఎంతో ఓపికాగా ఉంటున్న క్రమంలో పాక్ తీరుతో భారత్‌కు సహనం నశించింది. ఆ ఉగ్రమూక అమాయకుల ప్రాణాలు తీయడమే కాక.. మీ ప్రధానికి వెళ్లి చెప్పండనడంతో ఇక వారిని ఏమాత్రం ఉపేక్షించకూడదని నిర్ణయించుకొంది. పఠాన్ కోట్ నుంచి రియాసీ దాడి వంటి పెద్ద కుట్రలకు కేంద్రాలుగా నిలిచిన శిక్షణ శిబిరాలను మొత్తంగా నేలమట్టం చేసింది. ఇక్కడి స్థావరాల గుట్టును భారత్ నిఘా వర్గాలు ఎప్పటినుంచో సేకరించి పెట్టాయి. మొత్తం స్థావరాల గుట్టును పసిగట్టారు. అందుకే లక్షిత దాడులు చురుకుగా చేయగలిగారు. బహవల్‌పూర్‌లోని మర్కజ్ సుబాన్. ఇది సరిహద్దుకు 100 కిలోమీటర్ల దూరంలో ఉంది. జైషే మహ్మద్‌కు దీనిని ఆపరేషనల్ హెడ్‌క్వార్టర్‌గా అభివర్ణిస్తారు. పుల్వామా దాడి సహా భారత్‌పై చాలా కుట్రలు ఇక్కడే పురుడు పోసుకున్నాయి. మసూద్ అజార్ సన్నిహితులు ఈ కేంద్రం నుంచి ఆత్మాహుతి దాడులకు శిక్షణ ఇవ్వడం, వ్యూహాలు పన్నడం వంటివి చేశారు. దీనిని జైషే చీఫ్ మసూద్ ఇంటిగా కూడా వినియోగిస్తాడు. ప్రస్తుతం జైషే నెంబర్-2గా ఉన్న ముఫ్తీ అబ్దుల్ రవూఫ్ అస్గర్, మౌలానా అమర్ ఇతరుల కుటుంబసభ్యులు కూడా దీనిలో ఉంటున్నారు. 600 మంది ఉగ్రవాదుల ఇళ్లు కూడా ఈ క్యాంపస్‌లోనే ఉన్నట్లు తెలుస్తోంది. పెద్దఎత్తున లష్కరే క్యాడర్ ఇక్కడ నివాసం ఉంటోంది. వీరిలో కమాండర్లు, శిక్షకులు ఉన్నారు. లష్కరేలో చేరిన వారిని ఇక్కడ తరచూ హాఫీజ్ సయీద్ వచ్చి ఆహ్వానం పలుకుతాడు. ఇక్కడ అత్యధికంగా 250 మందికి ట్రైనింగ్ ఇచ్చేలా ఏర్పాట్లు ఉన్నాయి. ఎప్పుడూ 50-100 మంది ఉంటారు. ఫిజికల్ శిక్షణతోపాటు-.. జీపీఎస్ వాడటం, మ్యాప్ రీడింగ్, ఆయుధ వినియోగం, ప్రత్యేకమైన ఆయుధాల వాడకంపై శిక్షణ ఇస్తారు. పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ కార్యకలాపాలు కూడా ఇక్కడ చురుగ్గానే ఉంటాయి. వీరికి అవసరమైన ఆయుధాలను పాక్ సైన్యం సమకూరుస్తుంది. ముజఫరాబాద్‌లోని సైద్నా బిలాల్ ఉగ్ర స్థావరం. పీఓకేలోని జైషే ప్రధాన కేంద్రాల్లో ఇది ఒకటి. ముఫ్తీ అస్గర్ ఖాన్ కశ్మీరీ దీనికి అధిపతి. భారత్ నుంచి పారిపోయిన.. ఆసిక్ నెంగ్రూ, జైషే కమాండర్ అబ్దుల్ జిహాదీలు కూడా ఈ క్యాంప్‌ను వాడుకొన్నారు. ముజఫరాబాద్ రెడ్‌ఫోర్ట్‌కు ఎదురుగా ఉంటుంది. ఇక్కడికి వచ్చేవారికి పాక్ ఎస్ఎస్‌జీ కమాండోలు శిక్షణ ఇస్తారు. జమ్మూకశ్మీర్‌లోకి ఉగ్రవాదులను తరలించేందుకు వీలుగా దీన్ని రవాణా క్యాంప్‌గా నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఎప్పుడూ 50-100 మంది ఉగ్రవాదులు ఉంటారని సమాచారం.మురిద్కేలోని మర్కాజ్ తోయిబా. సరిహద్దుకు 30 కిలోమీటర్ల దూరంలోని లష్కరే క్యాంపు కార్యాలయం ఇది. దాదాపు 82 ఎకరాల్లో ఏర్పాటు- చేసిన ఉగ్ర క్యాంపస్ ఇది. ఇందులో మదర్సా, మార్కెట్ వంటివి కూడా ఉన్నాయి. ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేయడంలో ఈ క్యాంపస్‌దే కీలక పాత్ర. ఇది లష్కరే హెడ్‌క్వార్టర్‌గా పనిచేస్తోంది. దాదాపు 1000 మంది వరకు ముష్కరులు ఇక్కడ ఉగ్ర శిక్షణ పొందుతున్నారు. దీని నిర్మాణానికి 2000 సంవత్సరంలో అల్‌ఖైదా అధినేత ఒసామా బిన్ లాడెన్ 10 మిలియన్ డాలర్లు డొనేషన్‌గా ఇచ్చాడు. 26/11 ఉగ్రదాడికి పాల్పడిన దుర్మార్గుల్లో ఒకడైన అజ్మల్ కసబ్‌కు ఇక్కడే శిక్షణ ఇచ్చారు. ఈ దాడి కుట్రదారులు డేవిడ్ కోల్‌మన్ హెడ్లీ, తహవ్వూర్ రాణా ఈ కేంద్రాన్ని సందర్శించారు. లష్కరే సిద్ధాంతకర్తలు అమిర్ హమ్జా, అబ్దుల్ రెహ్మాన్ అబ్ది, జాఫర్ ఇక్బాల్ ఈ ప్రాంగణంలోనే నివాసం ఉంటున్నారు. లష్కరే చీఫ్ హాఫీజ్ సయీద్, జకీర్ రహ్మాన్ లఖ్వీలకు ఇక్కడ ఇళ్లు ఉన్నాయి. తెహ్రా కలాన్‌లోని సర్జల్ క్యాంప్. జైషే మహ్మద్ ఉగ్ర స్థావరం ఇది. దీన్ని కూడా జమ్మూకశ్మీర్ లోకి ఉగ్రవాదులను పంపించేందుకు ఉపయోగిస్తున్నారు. భారత్‌లోని సాంబా సెక్టర్‌కు కేవలం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. భారత్‌లోకి రహస్య సొరంగాలు తవ్వేందుకు ఇది కేంద్రంగా ఉంది. షకర్‌గర్ ప్రాంతాన్ని లష్కరే, జైషేలు సొరంగాల నెట్‌వర్క్‌గా మార్చేశాయి. భారత్‌లోకి ఆయుధాలు, మత్తు పదార్థాలు రవాణా చేసేందుకు ఇది ప్రధాన లాంచ్‌ప్యాడ్. ఇక్కడ కంట్రోల్ రూమ్ కూడా ఉంది. వీటిల్లో హిజ్బుల్ ముజాహిద్దీన్ రేడియో రిసీవర్లు, కమ్యూనికేషన్ సెంటర్లు ఉన్నాయి. జైషే కమాండర్లు ఇక్కడికి వచ్చి వెళుతుంటారు. ఖలిస్థాన్ -టైగర్ ఫోర్స్‌కు ఇక్కడ పారా ÷-లగైడింగ్‌లో శిక్షణ కూడా ఇచ్చారు. పఠాన్ కోట్ ఎయిర్ బేస్‌పై దాడి చేసిన ఉగ్రవాదులకు జైషే కమాండర్ షాహిద్ లతీఫ్ ఇక్కడే బ్రెయిన్ వాష్ చేశాడు. సియల్‌కోట్‌లోని మెహమూనా జోయా



క్యాంప్. అంతర్జాతీయ సరిహద్దుకు 15 కి.మీ. దూరంలో ఉన్న హిజ్బుల్ ముజాహిద్దీన్ శిబిరం ఇది. దీనికి చుట్టూ నివాస భవనాలు ఉన్నాయి. దీనికి మోహద్ ఇర్ఫాన్ ఖాన్ కమాండర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇతడు 1995లో జమ్మూలోని మౌలానా ఆజాద్ స్టేడియంలో వరుస పేలుళ్లకు పాల్పడ్డాడు. నాడు గవర్నర్ కేవీ కృష్ణారావు త్రుటిలో ఈ దాడుల నుంచి బయటపడ్డారు. ఈ ఉగ్ర స్థావరంలో దాదాపు 50 మంది ఉండేందుకు వీలుగా ఏర్పాట్లు- ఉన్నాయి. ఎల్లప్పుడూ ఇక్కడ దాదాపు 20-25 మంది ఉంటారు. బర్నాలలోని మర్కాజ్ అహ్లే హదిత్ ఉగ్ర స్థావరం. ఇది లష్కరే తోయిబా ఉగ్ర క్యాంప్. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని భింబెర్ జిల్లాలో ఉంది. ఇక్కడ 150 మందికి శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు- ఉన్నాయి. ఎప్పుడూ కనీసం 40 మంది ఉంటారు. ఈ కేంద్రాన్ని లష్కరే కమాండర్ ఖాసీం గుజ్జర్, అనాస్‌జరార్ నిర్వహిస్తున్నారు. పూంఛ్-రాజౌరి-రియాసీ సెక్టార్‌లోకి లష్కరే ఉగ్రవాదులు, ఆయుధాలను పంపించేందుకు దీన్ని వినియోగిస్తున్నట్లు సమాచారం. కోట్లిలోని మర్కాజ్ అబ్బాస్ ఉగ్ర స్థావరం. నియంత్రణ రేఖకు 35 కి.మీ. దూరంలో ఈ క్యాంప్ ఉంది. కోట్లీ- మిలిటరీ క్యాంప్‌నకు కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో దీనిని నిర్వహించడం గమనార్హం. ఇక్కడ 125 మంది శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు- ఉన్నాయి. ఏ సమయంలోనైనా కనీసం 50 మంది ఉంటారు. హాఫీజ్ అబ్దుల్ షకూర్ అలియాస్ ఖారీజరార్ ఈ కేంద్రానికి హెడ్. జైషే వ్యవస్థాపక సభ్యుల్లో ఒకడు. గతంలో హర్కత్ ఉల్ ముజాహిద్దీన్‌లో పనిచేశాడు. 2016 నగ్రోటాలోని బాలెనీ ఆర్మీ క్యాంప్‌పై దాడిలో ఇతడి హస్తం ఉన్నట్లు- ఎన్ఐఏ వెల్లడించింది. పఠాన్‌కోట్ ఉగ్రదాడి తర్వాత జైషే తన ఆయుధాలు, మందుగుండును దశాకా మర్కజ్ నుంచి తరలించి ఇక్కడ నిల్వ చేయడం మొదలుపెట్టింది. అవసరమైనప్పుడు షకూర్ స్వయంగా ఆయుధాలను తన వాహనంలో సియాల్‌కోట్‌కు తరలిస్తాడు. 2023 ఏప్రిల్ 20న పూంఛ్‌లో జరిగిన దాడులకు, జూన్ 24న బస్సులో ప్రయాణిస్తున్న అమాయక యాత్రికులపై దాడికి ఇక్కడి ఉగ్రవాదులే కారణం అని సమాచారం. కోట్లిలోని మస్కర్ రహీల్ షహీద్. పీఓకేలో హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన స్థావరం ఇది. దాదాపు 200 మందికి ఉగ్ర శిక్షణ ఇచ్చేలా దీనిని నిర్మించారు. ప్రస్తుతం అక్కడ 30 మంది వరకు ఉండొచ్చని అంచనా. తుపాకీల వినియోగం, శారీరక దృఢత్వంపై శిక్షణ ఇస్తారు. దీంతోపాటు- బోర్డర్ యాక్షన్ టీ-మ్, స్నైపింగ్ -టె-క్నిక్‌లు కూడా నేర్పిస్తారు. ఉగ్ర విద్యార్థులను కొండల్లోకి తీసుకెళ్లి.. పర్వత యుద్ధ తంత్రాల్లో శిక్షణ ఇస్తారు. హిజ్బుల్ చీఫ్ సయ్యద్ సలాహుద్దీన్ దీనికి అధిపతి. అతడే కొత్త ఉగ్రవాదులకు ఇక్కడ స్వాగతం పలుకుతాడని పేరుంది. అంతేకాదు శిక్షణను కూడా అతడే పర్యవేక్షిస్తాడు. కొండల ప్రాంతంలో ఉండే ఈ క్యాంప్‌లో నాలుగు గదులు, బ్యారక్‌లు ఉన్నాయి. వీటిలో పెద్దఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రి ఉన్నట్లు- సమాచారం. వీటితోపాటు- ఉగ్రవాదులకు బ్రెయిన్ వాష్ చేసేందుకు అవసరమైన ప్రచార సామగ్రి పెద్దఎత్తున ఇక్కడ నిల్వ చేస్తారు. ముజఫరాబాద్ లోని షవాయ్ నాలా క్యాంప్. ఇది 2000 సంవత్సరం నుంచి పనిచేస్తోంది. దీనికి హుజైఫా బిన్ యెమెన్, బైత్ ఉల్ ముజాహిద్దీన్ అనే పేర్లు కూడా ఉన్నాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని తంగ్ధర్ సెక్టార్‌లో సరిహద్దుకు 30 కిలోమీటర్ల పరిధిలో షవాయ్ లష్కరే క్యాంప్ ఉంది. ఈ ముఠాకు కీలకమైన క్యాంప్ ఇది. లష్కరే కమాండర్ అబు దుజానా దీనికి ఇన్‌ఛార్జి.

# పాక్‌తో యుద్ధ పరిస్థితులు,,ప్రధాని మోడీ విదేశీ పర్యటనలురద్దు

న్యూఢిల్లీ,పాకిస్థాన్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో భారత ప్రధాని మోడీ చేపట్టాల్సిన పలు విదేశీ పర్యటనలు రద్దయ్యాయి. రద్దుకు గల కారణాలను కేంద్రం వెల్లడించినప్పటికీ దేశీయ అంశాలకు ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా విదేశీ పర్యటనలు రద్దైనట్టు- తెలుస్తోంది. ఈ నెలలో క్రోయేషియా, నార్వే, నెదర్‌ల్యాండ్స్ పర్యటించాల్సి ఉండగా ఇది రద్దైంది. మరో రెండు రోజుల్లో చేపట్టాల్సిన రష్యా పర్యటనను కూడా ప్రధాని మోదీ రద్దు చేసుకున్నారు. నాజీలపై సోవియట్ యూనియన్ విజయాన్ని పుస్కరించుకుని మే 9 విక్టరీ డే వేడుకలు నిర్వహించనున్నారు. ఈ వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొనాల్సి ఉండగా పర్యటన చివరి నిమిషంలో రద్దు చేసుకోవాల్సి వచ్చింది. ఈ విషయాన్ని రష్యా ప్రతినిధి కూడా ధ్రువీకరించారు. భారత్ తరపున మరో అధికారి హాజరు కావొచ్చని అన్నారు. పహల్గాం దాడికి కారణమైన పాక్ ఉగ్రమూకలను అంతమొందించేందుకు భారత్ దయాది దేశంలోని ఉగ్రస్థావరాలపై సైనిక దాడులు బుధవారం అర్ధరాత్రి 1.44 గంటలకు నిర్వహించిన విషయం తెలిసిందే. మొత్తం తొమ్మిది స్థావరాలపై బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడిలో 70కి పైగా ఉగ్రవాదులు అంతమయ్యారు. జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజర్ కుటుంబసభ్యులు 10 మంది కూడా అంతమయ్యారు.ఇదిలా ఉంటే, ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో భారత ప్రధాని మోదీ రాష్ట్రపతి ముర్ముతో సమావేశమయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అంతకుమునుపు, కేబినెట్ సమావేశంలో పాల్గొన్న ప్రధాని పరిస్థితిని సమీక్షించారు. ఇక పహాల్గాం బాధితుల తరుపున ప్రతీకారం తీర్చుకున్న త్రివిధ దళాలను దేశప్రజలు ప్రశంసల్లో ముంచెత్తుతున్నారు. ప్రముఖులు మొదలు సామాన్యులకు సోషల్ మీడియావేదికగా సెల్యూట్ చేస్తున్నారు. ప్రధాని మోదీ కూడా త్రివిధ దళాలను, కేబినెట్‌ను ఈ సందర్భంగా ప్రశంసించారు.

# పహల్గామ్‌కు భారత్ ప్రతీకార దాడి

న్యూఢిల్లీ,పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకార దాడులు చేసింది. దీనికి సంబంధించి బుధవారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ దాడి గురించి ప్రధాని మోడీ సభ్యులకు వివరించారు. ఇది మనందరికీ గర్వకారణమైన క్షణమని ఆయన హర్షం వ్యక్తం చేసినట్లు- తెలుస్తోంది. భద్రతాబలగాలు చేసిన కచ్చితమైన దాడిగా 'ఆపరేషన్ సిందూర్'ను అభివర్ణించారని సమాచారం. పీఓకేలో ఐదు, పాక్‌లో నాలుగు ఉగ్రశిబిరాలను ఎలా లక్ష్యంగా చేసుకున్నారో ప్రధాని వారికి చెప్పారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడి తర్వాత దేశ ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఆ క్లిష్ట సమయంలో ప్రధాని మోదీ దేశాన్ని నడిపిన తీరును సభ్యులు కొనియాడారని తెలుస్తోంది. ఈ క్యాబినెట్ మీట్ తర్వాత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును మోదీ కలిశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి వీరు సమావేశం అయ్యారు. దీంతో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. ఇదిలా ఉంటే.. 'ఆపరేషన్ సిందూర్'ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యక్షంగా పర్యవేక్షించిన సంగతి తెలిసిందే. ఇక, ఉగ్రవాద శిబిరాలపై దాడులను భారత ఉన్నతాధి కారులు ప్రపంచ దేశాలకు వివరించారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసినట్టు- అమెరికా, రష్యా, యూకే, సౌదీ అరేబియా, యూఏఈకి సమాచారం అందించారు. మెరుపు దాడులపై వాషింగ్టన్ డీసీలోని భారత ఎంబసీ ప్రకటన విడుదల చేసింది. పాక్ పౌరులు, ఆర్థిక, సైనిక స్థావరాలపై దాడి చేయలేదని స్పష్టం చేసింది. ఈమేరకు అమెరికా విదేశాంగ కార్యదర్శితో .. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దభోల్ మాట్లాడారు.ఏప్రిల్ 22న పహల్గాంలోని బైసరన్ లోయలో సేదదీరుతున్న పర్యాటకులను ఉగ్రవాదులు లక్ష్యంగా చేసుకున్నారు. ముఖ్యంగా జంటల్లో పురుషులను వేరు చేసి.. వారిని మతం అడిగి మరీ కాల్చి చంపారు. ఉగ్రమూక టార్గెట్ చేసిన జంటల్లో అప్పటికి ఆరు రోజుల క్రితమే పె÷-లళైన నవవధూవరులు వినయ్ నర్వాల్, హిమాన్షి ఉన్నారు. -టె-ర్రరిస్టులు వినయ్‌ను హత్య చేయగా.. అతడి మృతదేహం వద్ద గుండెలవిసేలా రోదిస్తున్న హిమాన్షి చిత్రం దేశం మొత్తాన్ని కుదిపేసింది. వినయ్ నేవీ అధికారి కూడా. ఈ ఉగ్ర దాడిలో భర్తలను కోల్పోయిన మహిళల ప్రతీకారానికి చిహ్నంగా దీనిని చూడొచ్చు. యోధులకు పెట్టే వీరతిలకం అనే అర్థం కూడా దీనిలో ఉంది.

# నిస్సహాయతా ?

హైదరాబాద్,నాయకుడు అంటేనే బీరువు కాకూడదు. ధైర్యంగా ఏ సమస్య అయినా ఎదుర్కొనే విధంగా ఉండాలి. గుండెల్లో కొండంత కష్టం పెట్టుకున్నా నవ్వుతూ కనిపించాలి. నిబ్బరం కూడా చూపించాలి. కానీ తెలంగాణా సీఎం రేవంత్ రెడ్డి విషయమే తీసుకుంటే ఆయన కుండబద్దలు కొడుతున్నాను అనో లేక ఉన్నది ఉన్నట్లుగా నిజాయతీగా మాట్లాడుతున్నాను అనో భావించవచ్చు.కానీ జనంలోకి వేరే విధంగా అది వెళ్తోంది అంతే కాదు ప్రతిపక్షాల చేతికి కోరి అస్త్రాన్ని అందించినట్లు గా ఉంది అని అంటున్నారు. ఖజానాలో డబ్బులు లేవు ఆర్థికంగా ఇబ్బందులు అని రేవంత్ రెడ్డి చెబితే జనాలు అర్థం చేసుకుంటారా అన్నది ప్రధానమైన ప్రశ్న. అంతే కాదు ఆందోళన చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు సమ్మె ఆలోచన మానుకుని వెనక్కి వస్తారా అన్నది కూడా ఆలోచించాలి.ఖజానాలో డబ్బులు లేవు అని చెబితే ఏదో విధంగా పూడ్చుకోమంటారు ఈ రోజులలో అప్పులు చేయని రాష్ట్రమే లేదు. ఆ మాటకు వస్తే కేంద్రమే వేల కోట్లు అప్పు చేస్తోందని చెబుతారు. అటువంటిది అప్పు పుట్టడం లేదు దొంగలుగా చూస్తున్నారు అని ఒక ముఖ్యమంత్రి మాట్లాడితే ఎలా ఉంటుంది అన్నది ప్రశ్న. అంతే కాదు కేంద్ర మంత్రులు అపాయింట్మెంట్ ఇవ్వడం లేదు అని కూడా రేవంత్ రెడ్డి చెప్పుకోవడం వల్ల ఇమేజ్ తగ్గుతుంది కానీ బాధను ఎవరు అర్థం చేసుకుంటారు అని కూడా అంటున్నారు.ఏమీ లేదు ఒక సాధారణ కుటుంబంలో ఇంటి యజమాని నా దగ్గర డబ్బులు లేవు అంటే కుటుంబ సభ్యులే సహకరించని రోజులు ఇవి అలాంటిది గత కేసీఆర్ ప్రభుత్వం అన్నీ అప్పులు చేసింది. వాటి వడ్డీలు కడుతున్నాం అందువల్ల ఉన్న దాంతో సర్దుకుందాం, సంసారం వీధిన పడకూడదు అని రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారు.అయితే ఒక్కడూ ఈ మొర ఆలకించకపోగా విమర్శలు ఎక్కు పెడతారు. రేవంత్ చేసిన వ్యాఖ్యలకు వెంటనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నుంచి కౌంటర్ వచ్చింది. అప్పులు మీకు పుట్టవని ఆయన సెటైర్లు పేల్చారు. మీరు ఢిల్లీ వెళ్తే అందుకే ఎవరూ అపాయింట్మెంట్లు ఇవ్వరని కూడా ఎద్దేవా చేశారు.ఇక సామాన్య ప్రజల విషయానికి వస్తే వారికి ఎందుకు ఖజానా సంగతి పడుతుంది అన్నది ప్రశ్న. వారికి ఎన్నో ఆశలు పెట్టి హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. వచ్చిన తరువాత కొన్ని అమలు చేశారు. మరి కొన్ని చేయలేదు. ఇపుడు చూస్తే ఖజానా లో చిల్లి గవ్వ లేదు అని సాక్షాత్తూ సీఎం చెబుతున్నారు. కానీ జనాలు కనికరించి మాకు ఏ హామీ అమలు చేయవద్దు అని అంటారా. ఇది ఒట్టి భ్రమ కాకపోతేనూ అని అంటున్నారుఇవన్నీ చూస్తుంటే రేవంత్ రెడ్డి పదే పదే ఖజానా గురించి చెబుతూ తనను తాను తగ్గించుకుంటూ తెలంగాణా రాష్ట్ర ఇమేజ్ ని కూడా తగ్గిస్తున్నారు అని అంటున్నారు.

# అంతర్జాతీయ ఉగ్రవాది నోట వేదాంతమూ..వైరాగ్యమూ !



న్యూఢిల్లీ,ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించిన 56 ఏళ్ల మసూద్ అజార్ నోట వేదాంతమూ వైరాగ్యం తన్నుకుని వస్తోంది. భారత్ మీద గత మూడు దశాబ్దాలుగా అనేక రకాలుగా ఉగ్ర దాడులకు స్కెచ్ గీసి ఎంతో మంది అమాయకులను పొట్టన పెట్టుకున్న మసూజ్ అజాద్ కి ఇపుడు తన సొంత వారు సోదరి బావ మేనకోడలు పిల్లలు భారత్ చేసిన ఆపరేషన్ సింధూర్ దాడిలో మరణించడంతో దుఖం దొర్లుకుంటూ వస్తోంది.తాను పెంచి పోషించిన తాను ఆవహింప చేసుకున్న ఉగ్ర భూతమే తన కుటుంబాన్ని కాటు వేసిందని ఇంకా మసూద్ అజార్ తెలుసుకోలేకపోవడం విషాదమే. తన వారు అంత అల్లా వద్దకు అతిధులుగా వెళ్ళిపోయారు అని ఆ బృందంలో తాను కూడా ఎందుకు లేను అని బాధపడుతున్నాను అని ఆయన అన్నట్లుగా పీటీఐ వార్తా సంస్థ ఒక కథనాన్ని వెలువరించింది.తన వారు అంతా పోయాక తాను ఉండి ఎందుకు అని మసూజ్ అజార్ వైరాగ్యాన్ని ప్రదర్శిస్తున్నాడు. అదే సమయంలో ఆయన భారత్ మీద మోడీ మీద అక్కసు వెళ్ళగక్కుతున్నట్లుగా తెలుస్తోంది. ఇక చూస్తే కనుక పాకిస్థాన్‌లోని బహావల్‌పూర్‌లో ఉన్న జైషే మహ్మద్ ప్రధాన కార్యాలయంలోని జామియా మసీద్ సుభాన్ అల్లాపై జరిగిన దాడులలో మసూజ్ అజార్ పెద్ద సోదరి, ఆమె భర్త, ఒక మేనల్లుడు, అతని భార్య, ఒక మేనకోడలు, ఇంకా తమ బంధువర్గానికి చెందిన ఐదుగురు పిల్లలు మరణించారు.తన బంధువుల నిష్క్రమణకు సమయం ఆసన్నమైంది అని అంటూనే వారిని అల్లా చంపలేదని మసూజ్ అజార్ పెర్కొన్నారని తెలుస్తోంది. ఇక మసూజ్ అజార్ గురించి చూస్తే కనుక 1994లో భారత్‌లో అరెస్టయి అనంతరం ఎయిర్ ఇండియా ఐసీ 814 విమానం హైజాక్ ఘటన తర్వాత విడుదలై పాక్ లో ఉంటున్నాడు. అతను జైలులో ఉన్నాడని ఎన్నో అబద్ధాలు ఆడిన పాక్ ఆయనకు రాచ మర్యాదలు చేస్తూ జనవాసాలు ఉన్న చోటనే అపరిమితమైన భద్రతను కల్పిస్తూ వస్తోంది.బయట ప్రపంచానికి మాత్రం అతనితో ఎలాంటి సంబంధం లేదని చెబుతోంది. ఇలా పాక్ ఉగ్రవాదులకు స్వర్గధామంగా మారడానికి భారత్ మీద ఉగ్ర మూకలను ఎగదోయడానికి మసూజ్ అజార్ ప్రధాన కారణంగా చెప్పాలి. ఈ రోజున తన వారు తన రక్తం అని తెగ ఆవేదన వ్యక్తం చేస్తున్న మసూజ్ అజార్ కి భారత్ లోని ఉగ్రదాడులకు స్కెచ్ గీసి అమాయకులను పొట్టన పెట్టుకున్నపుడు ఆ భాద ఏమిటో తెలియదా అని నెటిజన్లు అంటున్నారు.నరేంద్ర మోడీ మీద భారత్ మీద రగులుతున్న ఈ అంతర్జాతీయ ఉగ్రవాది నిజంగా తన బంధువుల బృందంలో ఉండి పైలోకాలకు పయనం కట్టాల్సినదే అని అంటున్నారు. కానీ ఎక్కడో మిస్ అయి ఈ రోజున భారత్ మీద ప్రతీకారం అంటూ ఓవర్ యాక్షన్ చేస్తున్నాడని నెటిజన్లు మండిపడుతున్నారు.భారత్ మీద దాడి అన్న మాట మరచిపోతే ప్రశాంతగా మసూజ్ అజార్ తన జీవితాన్ని కొనసాగించడానికి వీలు ఉంటుందని అంటున్నారు. అలా కాకుండా పాత పద్ధతులతో భారత్ మీద ఎటాక్ చేయాలని చూస్తే కనుక రానున్న పరిణామాలకు ఆయన భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని అంటున్నారు.తనదాకా వస్తే కానీ తెలియదు అని అంతా అంటారు. ఈ రోజున తన వారు కళ్ళ ముందు విగతజీవులుగా ఉండడం వల్లనే మసూజ్ అజార్ లో వైరాగ్యం వచ్చిందని నెటిజన్లు అంటున్నారు. ఈ ఘటనపై తనకు ఎలాంటి విచారం గానీ, నిరాశ గానీ లేదని ఈ కరడు కట్టిన అంతర్జాతీయ ఉగ్రవాది అంటున్నాడు అంటే భారత్ మరింత జాగ్రత్త వహించాల్సి ఉంది. అలాగే గట్టి నిఘా పెట్టి మసూద్ అజార్ పని పట్టాల్సి ఉందని సూచిస్తున్నారు.

# మోడీకి చేరో వైపు పవన్ లోకేష్



అమరావతి,భారత ప్రధాని నరేంద్ర మోడీ అత్యంత సాహసోపేతంగా పాక్ మీద ఆపరేషన్ సింధూర్ పేరుతో భారీ దాడి నిర్వహించారు. దాని ఫలితం పాక్ కి దిమ్మదిరిగి బొమ్మ కనిపించింది. పాక్ గడ్డ మీద నిలిచి దాని కూసాలు కదల్చడం అంటే యాభై అంగుళాల చాతీ ఉన్న మోడీకే సాధ్యమని దేశమంతా అనుకునేలా ఈ దాడి సాగింది.ఇక భారత ప్రధానికి ఇంటా బయటా అనూహ్య మద్దతు దక్కుతోంది. దేశంలోని ప్రత్యర్థి పార్టీలు అన్నీ కూడా ఉగ్రవాదుల మీద దాడులు చేసిన కేంద్రానికి పూర్తి దన్నుగా ఉంటామని ప్రకటించాయి. ఎన్డీయే మిత్రులు అయితే మోడీ అసమాన వీరుడు అని కీర్తించాయి.అయితే అంతటా వేరు ఏపీ వేరు. ఏపీలో చూస్తే మోడీ నామస్మరణ గత ఏడాదిగా ఎక్కువగా ఉంది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కి మోడీ అంటే ఎంతో ఆరాధనాభావం ఉంది అన్నది అందరికీ తెలిసిందే. ఆయన 2014లో పార్టీ పెట్టినపుడు గుజరాత్ వెళ్ళి మరీ మోడీని కాబోయే ప్రధానిగా అభివర్ణిస్తూ మద్దతు ఇచ్చారు. ఆ మధ్యలో కొంత బీజేపీని విభేదించినా ఈ పదకొండేళ్ళలో అత్యధిక కాలం ఆయన బీజేపీని మోడీని ప్రశంసిస్తూనే ఉన్నారు.తాజాగా పాక్ కి భారత్ గుణపాఠం చెప్పిన నేపథ్యంలో పవన్ కళ్యాణ్ తనదైన స్పందనను తెలియచేస్తూ మోడీని ఆకాశానికి ఎత్తేశారు. మోడీ వెంటనే భారత్ అన్నారు. భారతదేశం మోడీ నాయకత్వంలో తనను తాను రక్షించుకోగలదని కూడా అన్నారు. దేశం కోసం పాటు పడేవారు అంతా మద్దతుగా నిలవాలని సైన్యానికి దేశానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టేవారి మీద చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. అలా పవన్ అందరి నేతల కంటే భిన్నంగా మోడీని కొనియాడుతూ ఈ ఘటన పట్ల తన స్పందనను వ్యక్తం చేశారు.కట్ చేస్తే తరువాత వంతు నారా లోకేష్ ది. ఆయన ఇటీవల కాలంలో నరేంద్ర మోడీని తెగ పొగుడుతున్నారు. దానికి శుభారంభం విశాఖలో జరిగిన మీటింగులో అయింది. మోడీని నమో అని ఆ సభలో పదే పదే పొగిడిన లోకేష్ ఇటీవల అమరావతిలో జరిగిన సభలో ఏకంగా మిసైల్ అనేశారు. ఒక్క పాక్ కాదు కదా వందలాది పాక్ లు వచ్చినా మోడీ ముందు ఆటలు సాగవని చెబుతూ ఆయనను వేదిక మీద ఉండగానే ఉబ్బితబ్బిబ్బు చేశారు.ఇపుడు పాక్ మీద భారత్ సక్సెస్ ఫుల్ గా ఎటాక్ చేసింది. దాంతో లోకేష్ కూడా పవన్ కి ఏ మాత్రం తీసిపోకుండా మోడీని కొనియాడారు. మిసైల్ అన్న విశేషణాన్ని జోడించి మరీ ట్వీట్ చేశారు. అంతే కాదు తిరుపతి జిల్లా సత్యవేడులో టీడీపీ నిర్వహించిన సమన్వయ సమావేశంలో లోకేశ్ మాట్లాడుతూ దేశ శత్రువులపై పోరాటంలో ప్రధాని నరేంద్ర మోదీ తీసుకునే ప్రతి నిర్ణయానికి తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు.వంద పాకిస్థాన్‌లు వచ్చినా మన దగ్గర ప్రధాని నరేంద్ర మోదీ అనే మిసైల్ ఉంది. భారతీయులను చంపిన వారిని వదిలిపెట్టకూడదనే లక్ష్యంతో పాకిస్థాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పారని లోకేశ్ కొనియాడారు. మొత్తం మీద చూస్తే మోడీని పొగడడం విషయంలో అటు కూటమి నేతలు పోటీ పడుతున్నారా అన్న చర్చ సాగుతోంది. ఏపీలో బీజేపీకి బలం లేదు, కానీ కేంద్రంలో అధికారంలో ఉంది బలమైన ప్రధానిగా మోడీ ఉన్నారు.దాంతో ఏపీలో ఏమి జరగాలన్నా మోడీ నైతిక మద్దతు అవసరం. అందుకే ఒక ప్రణాళికాబద్ధంగా కూటమి నేతలు అంతా మోడీ లైన్ తీసుకుంటున్నారు అని అంటున్నారు. మోడీకి ఈ కీలక సమయంలో అంతా మద్దతుగా నిలవాల్సిందే అన్నది నిజం.

# ఆ ఊరు పేరు చెబితేనే మంత్రులకు హడల్..!



హైదరాబాద్,ధర్మపురి నియోజకవర్గంలో జరిగే ఏదో ఒక అభివృద్ధి పనులకు మంత్రులు సీతక్క, శ్రీధర్ బాబు, భట్టి విక్రమార్క, కొండా సురేఖ, ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరవగా..వారంతా..ఓ నియోజకవర్గంలో అమాత్యులు అడుగు పెట్టాలంటేనే తెగ ఆలోచిస్తున్నారట. ఎమ్మెల్యే ఆహ్వానించినా మంత్రులు రావడానికి జంకుతున్నారట.ఇందుకు ఓ రాజకీయ కారణం ఉందనే చర్చ రాజకీయవర్గాల్లో నడుస్తోంది.ఉప్పు..నిప్పులా ఉన్న నేతల మధ్య జోక్యం చేసుకోవడం కంటే కాస్త దూరంగా ఉండడమే మంచిదనుకుంటున్నారట ప్రభుత్వ పెద్దలు. సీనియర్ నేతతో పంచాయితీ మాకెందుకు అనుకునే వారు నియోజకవర్గ రాజకీయాల్లో తల దూర్చడానికి భయపడుతున్నారట. ఇంతకీ ఇరుగు పొరుగు నియోజకవర్గాల్లో పర్యటిస్తున్న మంత్రులు ఎందుకు ఆ నియోజకవర్గానికి ఆమడ దూరంలో ఉంటున్నారు? కండువా కప్పుకున్న ఎమ్మెల్యేను అక్కున చేర్చుకున్నట్లా?

**వామ్మో జగిత్యాలకా మేం రాం అంటున్న మంత్రులు..!**

జగిత్యాల కాంగ్రెస్ అంటేనే జీవన్ రెడ్డి జీవన్ రెడ్డి అంటే కాంగ్రెస్ అనే చెరగని ముద్ర వేసుకున్నారు. కానీ అధికారంలోకి వచ్చిన తరువాత జీవన్ రెడ్డికి ఊహించని పరిణామాలు ఎదురవుతున్నాయి. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను హస్తం పార్టీలో చేర్చుకోవడాన్ని జీవన్ రెడ్డి వ్యతిరేకిస్తూనే ఉన్నారు. ఆయనతో కలిసి పని చేయడానికి ససేమిరా అంటుండడంతో రెండు వర్గాలుగా విడిపోయింది జగిత్యాల కాంగ్రెస్. ప్రస్తుతం ఇద్దరి మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమనేలా తయారైందట పరిస్థితి.జీవన్ రెడ్డి సీనియర్ నేత కావడంతో ఆయన తో సన్నిహితంగా ఉన్న వాళ్లంతా..ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కి దూరంగా ఉంటున్నారు. అందుకే జీవన్ రెడ్డిని కాదని కొంతమంది పార్టీ శ్రేణులు..సంజయ్ కుమార్ తో సఖ్యతగా మెదలడం లేదనే చర్చ జరుగుతోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏవైనా ప్రారంభించాలన్నా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయాలన్నా జగిత్యాలకు అమాత్యులు ఆమడ దూరం ఉంటున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

**సంజయ్ కుమార్ ను ఒంటరిని చేయడానికేనా?**

అయితే పొరుగు నియోజకవర్గమైన ధర్మపురి ఎమ్మెల్యే, జగిత్యాల జిల్లా అధ్యక్షుడైన అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సైతం జీవన్ రెడ్డి మాట జవ దాటరు. అందుకే జీవన్ రెడ్డి పట్ల విధేయతను ప్రదర్శించే క్రమంలో లక్ష్మణ్ కుమార్..ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ని కలుపుకొని వెళ్లేందుకు సంకోచిస్తుంటారట. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సైతం జీవన్ రెడ్డిని కాదని నియోజకవర్గంలో అడుగు పెట్టే పరిస్థితి లేదట. ధర్మపురి నియోజకవర్గంలో జరిగే ఏదో ఒక అభివృద్ధి పనులకు మంత్రులు సీతక్క, శ్రీధర్ బాబు, భట్టి విక్రమార్క, కొండా సురేఖ, ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరవగా..వారంతా జగిత్యాలను టచ్ చేయకుండానే వెళ్లిపోతున్నారట.సంజయ్ కుమార్‌ను ఒంటరిని చేయడానికే జీవన్ రెడ్డి మంత్రులను అడుగు పెట్టకుండా చేస్తున్నారనే టాక్ జిల్లా రాజకీయవర్గాల్లో సాగుతోంది.

**స్వపక్షంలో విపక్షంలా తయారైన ఇద్దరు నేతలు..**

సీఎం రేవంత్ రెడ్డి మనిషిగానే ఎమ్మెల్యే సంజయ్ కి ముద్ర పడింది. సంజయ్ సైతం నియోజకవర్గ అభివృద్ధి నిధుల కోసం నేరుగా సీఎంనే సంప్రదించి నిధులను మంజూరు చేయించుకుంటున్నారట. దీంతో కాంగ్రెస్ కండువా కప్పుకున్న సంజయ్ ని పార్టీ నాయకత్వం అక్కున చేర్చుకున్నట్లా లేనట్లా అనే చర్చ జగిత్యాల రాజకీయవర్గాల్లో జరుగుతోంది. ఇద్దరి మధ్య రాజీ కుదర్చడానికి ఎవరూ సాహసించకలేకపోతున్నారట. దీంతో ఇద్దరి మధ్య అంతర్గత విభేధాలు కాస్తా రచ్చకెక్కుతున్నాయి.ఇద్దరు నేతల వ్యవహారంతో స్వపక్షంలో విపక్షంలో మారింది పరిస్థితి. ఒకే జెండా కింద రాజకీయాలు సాగిస్తున్న జీవన్ రెడ్డి, సంజయ్ కుమార్..వీరిద్దరి చేతులు కలిసేంత వరకు జగిత్యాలలో మంత్రులు అడుగు పెట్టరనే చర్చ రాజకీయవర్గాల్లో సాగుతోంది.

# భారతీయ ‘సైనిక రైళ్ల’పై పాకిస్థాన్ నిఘా?




న్యూఢిల్లీ,భారత సైన్యం నిర్వహించిన ఆపరేషన్ పాకిస్థాన్ కోలుకునే అవకాశం లేకుండా చేసింది. రాత్రి 1:05 నుంచి 1:30 వరకు భారత సైన్యం చేసిన దాడి పాకిస్థాన్ సైన్యాన్ని కుదిపేసింది.దాడి ముగిసిన 25-30 నిమిషాల వరకు.. పాకిస్థాన్ ఎలా స్పందించాలో అర్థం కాలేదు. నిమిషాల వ్యవధిలో మొత్తం అయిపోయింది. కాగా.. ఈ దాడి తరువాత భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు తలెత్తిన విషయం తెలిసిందే. భారత ‘సైనిక రైళ్ల’ కదలికల గురించి తెలుసుకునేందుకు పాకిస్థాన్ నిఘా సంస్థలు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. దీంతో రైల్వే శాఖ అప్రమత్తమైంది. రహస్య సమాచారాన్ని ఎవ్వరితో పంచుకోవద్దని సూచించింది. ఈ మేరకు ఉద్యోగులకు అడ్వైజరీ జారీ చేసింది. సమాచారం బహిర్గతం చేయడం జాతీయ భద్రతకు ముప్పుగా పరిణమిస్తుందని తెలిపింది.“భారత మిలటరీ రైళ్ల కదలికలకు సంబంధించి కీలక సమాచారాన్ని పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ సంస్థలు రాబట్టే అవకాశం ఉంది. రైల్వేలో మిలటరీ విభాగానికి తప్ప.. ఎటువంటి అనధికార వ్యక్తులకు ఆ సమాచారం ఇచ్చినా భద్రతా ఉల్లంఘనగా పరిగణిస్తాం. దానివల్ల దేశ భద్రతకు తీవ్ర ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. సైనిక రైళ్ల కదలికల సమాచారానికి ఉన్న ప్రాధాన్యం, తీవ్రత దృష్ట్యా దీనిపై రైల్వే అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి” అని అన్ని రైల్వే జోన్ల ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్ మేనేజర్లకు పంపిన సందేశంలో రైల్వే బోర్డు పేర్కొంది.

# కేసులకు భయపడితే రాజకీయాలు చేయలేం..



అమరావతి,తప్పకుండా అధికారంలోకి వస్తాం అని, అందులో ఎలాంటి సందేహం లేదని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం (కూటమి ప్రభుత్వం) తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశం లేదన్నారు.ప్రజలకిచ్చిన హామీలను పూర్తిగా పారదర్శకంగా అమలు చేసిన మనకే ఇలాంటి పరిస్థితి వచ్చిందంటే.. ఇక అబద్ధాలు చెప్పి, మోసాలు చేసిన చంద్రబాబు నాయుడు పరిస్థితి ఎలా ఉంటుందో అని ఎద్దేవా చేశారు. చంద్రబాబు రాకముందు మన పథకాల ద్వారా పేదల నోట్లోకి నాలుగు వేళ్లు వెళ్లేవని, ఇప్పుడు ప్రజలు తింటున్న కంచాన్ని చంద్రబాబు లాగేశాడని విమర్శించారు. ఇప్పుడు కలియుగం పాలిటిక్స్ నడుస్తున్నాయని, కేసులకు భయపడితే రాజకీయాలు చేయలేం అని వైఎస్ జగన్ పేర్కొన్నారు.‘తప్పకుండా అధికారంలోకి వస్తాం, అందులో ఎలాంటి సందేహం లేదు. ఈ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశం లేదు. ప్రజలకిచ్చిన హామీలను పూర్తిగా పారదర్శకంగా అమలు చేసిన మనకే ఇలాంటి పరిస్థితి వచ్చింది. ఇక అబద్ధాలు చెప్పి, మోసాలు చేసిన చంద్రబాబు పరిస్థితి ఎలా ఉంటుంది. 2014లో కూడా చంద్రబాబు తానిచ్చిన హామీలను అమలు చేయలేదు. మనం పాదయాత్ర చేసి, ప్రజలకు భరోసా ఇచ్చాం. 2019 ఎన్నికల్లో ప్రజావ్యతిరేకత కొట్టిచ్చినట్టు ఎన్నికల ఫలితాల్లో కనిపించింది. ప్రజావ్యతిరేకతను చీల్చడానికి చంద్రబాబు తన రాజకీయ భాగస్వామిని వేరేగా పోటీ చేయించారు. అయినా బాబు తన ఓటమిని అడ్డుకోలేకపోయారు. చంద్రబాబు రాకముందు మన పథకాల ద్వారా పేదల నోట్లోకి నాలుగు వేళ్లు వెళ్లేవి, ఇప్పుడు ప్రజలు తింటున్న కంచాన్ని లాగేశాడు. అంతేకాదు తానిచ్చిన హామీలను కూడా అమలు చేయలేదు. రెండు రకాలుగా చంద్రబాబు ప్రజలను మోసం చేశాడు. విద్య, వ్యవసాయం, వైద్య రంగాలు పూర్తిగా నీరు గారిపోయాయి. ఉచిత పంటల బీమా గాలికి ఎగిరిపోయింది. రైతులకు పెట్టుబడి సహాయంగా ఉన్న రైతు భరోసా ఎగిరిపోయింది. అవినీతి విచ్చలవిడిగా జరుగుతోంది. రూపాయికి ఇడ్లీ వస్తుందో లేదో తెలియదు కానీ.. అదే రూపాయికి వేల కోట్ల విలువైన భూములు కట్టబెడుతున్నారు. లూలుకు 1500 కోట్ల భూములు కట్టబెట్టారు. మరొకరికి 3 వేల కోట్ల భూములు కట్టబెట్టారు’ అని వైఎస్ జగన్ మండిపడ్డారు.‘రైతులకు ఉచితంగా విద్యుత్ అందించడానికి సెకీతో మనం 2.49 రూపాయలకే విద్యుత్ కొనుగోలు చేశాం. ఇవాళ వీళ్లు 4.60లకు కొనుగోలు చేశారు. సెక్షన్ 108 ప్రకారం ఏపీఆర్సీపీ మీద ఒత్తిడి తెచ్చి మరీ అమలు చేయించుకున్నారు. అవినీతి మన కంటికి కనిపిస్తోంది. మట్టి మాఫియా, ఇసుక మాఫియా, పేకాట క్లబ్బులు, బెల్టు షాపులు, ఎమ్మార్పీ ధర కన్నా లిక్కర్ ఎక్కువకు అమ్ముకుంటున్నారు. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేకు ముట్టజెప్పనిదే ఏమీ కావడం లేదు. ఇవన్నీ కంటికి కనిపిస్తున్నాయి. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నడుపుతున్నారు. ఒక్కసారి ఓటు వేశాక ఐదేళ్ల పాటు ప్రజలు వేచి చూడాలి. అందుకే ఇప్పుడేమీ చేయలేక ప్రజలు అన్నింటినీ చూస్తున్నారు. సమయం వచ్చినప్పుడు కచ్చితంగా ప్రజలు కచ్చితంగా తగిన తీర్పు ఇస్తారు. ఇప్పుడు కలియుగం పాలిటిక్స్ నడుస్తున్నాయి. కేసులకు భయపడితే రాజకీయాలు చేయలేం. చంద్రబాబు రాజకీయాలను ఒక దారుణమైన స్థాయికి తీసుకెళ్లారు. రాజకీయాల్లో ఇలాంటి పరిస్థితులు ఉండకూడదని మన ప్రభుత్వంలో చాలా కష్టపడ్డాం. మన పరిపాలనలో చాలామంది నాయకులను కట్టడి చేశాం. తాడిపత్రిలో మున్సిపల్ ఎన్నికలు జరిగినప్పుడు టీడీపీకి స్వల్ప ఆధిక్యత వచ్చింది. వైసీపీకి 16, టీడీపికి 18 వచ్చాయి. కాని అప్పటి వైసీపీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి మన పార్టీ వైపునకు ఫలితాన్ని తిప్పుదామని యత్నించారు. ఆరోజు మన పార్టీ ఎమ్మెల్యే అయిన పెద్దారెడ్డిని గృహనిర్బంధం చేశాం. ఇప్పుడు ఏడాది కాలంగా పెద్దారెడ్డిని తాడిపత్రిలోకి అడుగుపెట్టనీయడం లేదు. కార్యకర్తల ఆస్తులను విధ్వంసం చేస్తున్నారు. ఇప్పుడు పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయి. చంద్రబాబు రెడ్‌బుక్ రాజ్యాంగం, కక్ష రాజకీయాలతో రాజకీయ వ్యవస్థ దారుణంగా తయారైంది. ఈ ప్రభుత్వం చేసిన దుర్మార్గాలు చూసిన తర్వాత నాలో చాలా మార్పు వచ్చింది. కార్యకర్తలకు కచ్చితంగా ప్రాధాన్యత ఉంటుంది. పార్టీలో కష్టపడే ప్రతి ఒక్కరినీ గొప్ప స్థానంలో కూర్చోబెడతాను. ఈసారి కార్యకర్తలకే మొదటి ప్రాధాన్యత. చంద్రబాబులా అబద్ధాలు చెప్పలేను.. ప్రజలకు హామీలు ఇస్తే కచ్చితంగా నెరవేరుస్తాను. కార్యకర్తల్లో ఇప్పటికే మంచి చైతన్యం వచ్చింది. కేడర్ ధైర్యంగా నిలబడింది. రాష్ట్ర వ్యాప్తంగా నేను ఎక్కడకు వెళ్లినా పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, ప్రజలు తరలివస్తున్నారు. రాష్ట్రంలో అరాచక పాలన పట్ల వివిధ రూపాల్లో వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు పరిపాలన పట్ల తీవ్ర మైన ఆగ్రహం ఉంది. రాజకీయాలతో సంబంధం లేని వారిని కూడా కక్షలకు గురిచేస్తున్నారు’ అని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కృష్ణా నీటి అక్రమవాడకాలకు చెక్



న్యూఢిల్లీ, కృష్ణా నది నుంచి ఎపి అక్రమంగా నీటిని తరలించకుండా నియంత్రణ అవసరమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు నదిపై వివిధ ప్రదేశాల్లో టెలిమెట్రీ పరికరాలను ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరారు. అలాగే, పోలవరం బ్యాక్ వాటర్ వల్ల ముంపు ప్రమాదం ఉందని పేర్కొంటూ రిటెన్షన్ వాల్ నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర జల సంఘం ఛైర్మన్ అతుల్ జైన్ తో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీలో బుధవారం భేటీ అయ్యారు. వివిధ ప్రాజెక్టులతో పాటు అనేక అంశాలను చర్చించారు. మేడిగడ్డ, సమ్మక్క సారక్క, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులపై వీరిద్దరి మధ్య చర్చ జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. మేడిగడ్డ డ్యామ్ కూలిపోవడం పై జాతీయ డామ్ సంరక్షణ సంస్థ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో తదుపరి కార్యాచరణ పై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. అనంతరం సమావేశ వివరాలను ఉత్తమ్ వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర జల సంఘం ఛైర్మన్ అతుల్ జైతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మేడిగడ్డ, సమ్మక్క సారక్క, పాలమూరు-రంగారెడ్డి వంటి ప్రధాన ప్రాజెక్టులపై చర్చ జరిగింది. రాష్ట్ర నీటిపారుదల శాఖకు చెందిన ఉన్నతాధికారులు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఇక మేడిగడ్డ డ్యామ్ కూలిపోవడంపై జాతీయ డ్యామ్ సంరక్షణ సంస్థ ఇప్పటికే నివేదికను సమర్పించింది. ఈ నివేదికలో మేడిగడ్డ డిజైన్, ఆపరేషన్‌లో లోపాలున్నాయని స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్.. ప్రజాధనాన్ని దుర్వినియోగం కాకుండా, ప్రాజెక్ట్ పునరుద్ధరణకు సరైన మార్గాలను అన్వేషిస్తున్నాం అని పేర్కొన్నారు. డీపీఆర్‌లో చూపిన స్థలం ఒకటి కాగా, అసలు నిర్మాణం వేరే ప్రాంతంలో జరిగిందని ఆయన విమర్శించారు. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీల విషయంలో కేంద్ర జల సంఘంతో సంప్రదింపులు కొనసాగించాల్సిన అవసరం ఉందని ఎన్డీఎస్సీ సూచించిందని చెప్పారు.అలాగే నూతన నిర్మాణాలు, కేటాయింపులపై ఆయన చర్చించారు. ఇందులో భాగంగా మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలను పునరుద్ధరించాలా లేదా అనే అంశంపై తుది నిర్ణయం తీసుకోలేదని మంత్రి తెలిపారు. అలాగే తుమ్మిడి హట్టి వద్ద కొత్త ప్రాజెక్టును నిర్మించనున్నట్లు- వెల్లడించారు. ఇంకా సమ్మక్క సారక్క ప్రాజెక్టుకు 44 టీ-ఎంసిల నీటిని త్వరితగతిన కేటాయించాలని కోరారు. వీటితోపాటు- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు మొత్తం 90 టీ-ఎంసిలు అవసరమని, తక్షణమే 45 టీఎంసులను ముందుగా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఇక ముఖ్యంగా

# ఉద్రిక్తతల మధ్య కర్తార్‌పూర్ కారిడార్ మూసివేత

చండీగఢ్,పంజాబ్‌లోని గురుదాస్‌పూర్‌జిల్లాలో డేరాబాబా నానక్ వద్ద ఉన్న కర్తార్‌పూర్ కారిడార్‌ను బుధవారం మూసివేసినట్లు- సీనియర్ అధికారి తెలిపారు. పంజాబ్‌లో గురుదాస్‌పూర్ జిల్లాలోని డేరాబాబా నానక్ మందిరాన్ని, పాకిస్తాన్‌లోని దర్బార్ సాహిబ్ గురుద్వారాలను కర్తార్‌పూర్ కారిడార్ కలుపుతుంది. ఈ కారిడార్‌ను నిలిపివేశామని, దర్బార్ సాహిబ్ గురుద్వారాను సందర్శించేందుకు యాత్రికులను అనుమతించరని అన్నారు. పాకిస్తాన్‌లోని గురుద్వారాలో ప్రార్థనలు చేసేందుకు బుధవారం ఉదయం పలవురు యాత్రికులు కర్తార్‌పూర్ కారిడార్ చేరుకున్నారు. యాత్రికులందరినీ తిరిగి రావాల్సిందిగా ఆదేశించినట్లు- వెల్లడించారు. గురునానక్ దేవ్ 550వ జయంతి సందర్భంగా 2019, నవంబర్ 9న కర్తార్‌పూర్ కారిడార్‌ను ప్రారంభించారు. గురునానక్ అంతిమ విశ్రాంతి స్థలమైన గురుద్వారాకు అన్ని మతాలకు చెందిన భారతీయ యాత్రికులు ఏడాది పొడవునా వీసా లేకుండా ప్రయాణించేందుకు అనుమతి ఉంది. భారత్ మరియు పాకిస్తాన్‌ల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం.. రోజుకు 5,000 మంది యాత్రికులు గురుద్వారాను సందర్శించవచ్చు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com